**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 68, పేజీలు - 08

శుక్రవారం, సెప్టెంబర్ 4, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మంత్రివర్గం నుంచి
# కొండా సురేఖ బర్తరఫ్



**- రాజీనామాకు నిరాకరించడంతో రేవంత్ సంచలన నిర్ణయం**

**- పార్టీలో నెలకొన్న వివాదాలకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం**
**- సురేఖను కేబినెట్ నుంచి తొలగించేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్**
**- ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డి తొలగింపు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ గవర్నర్‌కు పంపగా బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు.
కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది.

### చిన్నారెడ్డి పదవి గద్వాల్ విజయలక్ష్మికి!

ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### బీసీ మహిళలకు పదవులు

మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను

2లో..

# నన్ను తొలగించడం కుట్రే



**- కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!**

**- మంత్రి పదవి నాకు ఓ ఆభరణం లాంటిదే**
**- వైఎస్ఆర్‌లా సీఎం రేవంత్ రెడ్డికి కమ్యూనికేషన్ లేదు**
**- తన వివరణ తీసుకోలేదన్న సురేఖ, నలుగురు నేతలపై కుట్ర ఆరోపణలు**
**- కూతురు వ్యాఖ్యలను ఆయుధంగా మార్చారని ఆరోపణ**

**నేను తప్పు చేయలేదు, నాకు అవమానం ఎందుకు'అని కొండా సురేఖ అన్నారు. 'దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిలా రేవంత్ రెడ్డి కి కమ్యూనికేషన్ లేదు. ప్రజలతో,నేతలతో వైఎస్ఆర్ ఉన్నట్లు రేవంత్ రెడ్డి లేడు'అని కొండా సురేఖ చెప్పుకొచ్చారు.**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కేబినెట్ నుంచి తనను బర్తరఫ్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మాజీ మంత్రి కొండా సురేఖ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మీడియా సమావేశంలో ఆమె సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల లక్ష్యంగా విమర్శల బాణాలు సంధించారు. తనకు కనీసం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీస ముగింపు వివరణ కూడా కోరకుండా ఏకపక్షంగా బర్తరఫ్ చేయడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందన్నారు. ఉరిశిక్ష వేసే ఖైదీకి కూడా చివరి కోరిక అడుగుతారని, కానీ దశాబ్దాలుగా ప్రజల్లో ఉంటూ ఎదిగిన తనకు కనీస గౌరవం ఇవ్వకుండా కుట్రపూరితంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సురేఖ, నేను పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటాను అని తనకు తానే ప్రకటించుకోవడం, ముందస్తుగా ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడం మోనోపోలీ పరిపాలనకు నిదర్శనమని మండిపడ్డారు. బిసి మహిళనైన తనను పదవి నుంచి తొలగించిన తీరుపై సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేం నరేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలంతా ఏకమై తనపై కక్షగట్టి బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో బర్తరఫ్ చేయించారని ఆరోపించారు. మల్లు రవి, రోశయ్యల నుంచి నేటి అగ్రనేతల వరకు గతంలో పార్టీని, ఇందిరాగాంధీని విమర్శించిన వారిని పక్కనబెట్టి, తనపై మాత్రం కఠినంగా వ్యవహరించడం వెనుక ఉన్న వ్యూహాన్ని ప్రశ్నించారు.
సొంత ప్రభుత్వం మరియు కేబినెట్ వాతావరణంపై సురేఖ సంచలన విషయాలను బయటపెట్టారు. "ఈ ప్రభుత్వంలో ఏ ఒక్క మంత్రి కూడా సంతోషంగా లేరు. మంత్రులంతా గుండెపై చేయి వేసుకుని నిజం చెప్పాలి. పనులు కావాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని పక్షపాత వాతావరణం నెలకొంది" అని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలంతా ధైర్యంగా బయటకు వచ్చి ప్రభుత్వం జరుగుతున్న పరిణామాలపై గళం విప్పాలని పిలుపునిచ్చారు.

2లో..

## ఉద్యమాల ఖిల్లా నుంచే..
# గులాబీ గర్జన

**- రైతుల కోసం పాదయాత్ర చేస్తానన్న కేటీఆర్**


హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు నీటి విడుదల షెడ్యూల్‌ను ఈ నెల 14లోపు ప్రకటించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్దేశిత గడువులోగా షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలో బిఆర్ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు

2లో..



## 2027 వరకు
# ఎల్‌నినో

**- డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది.

2లో..

# అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

**- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు**

**- పొగాకు, పొల్ట్రీ రైతులకు గుడ్ న్యూస్ - 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం**
**- రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు**

అమరావతి (ప్రశ్న న్యూస్) 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు, మత్స్యకారులు, అమరావతి, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అలాగే రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు జరిగాయి. తోతాపురి మామిడికి మద్దతు ధర కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.281 కోట్ల నిధులు సమకూర్చుకునే ప్రతిపాదన, పొగాకు రైతులకు డీబీటీ ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం అంశాలు కేబినెట్ ముందుకు

2లో..



# మోదీని అడిగే దమ్ముందా.?

**- తెలంగాణ బీజేపీ నేతలకు మంత్రి పొన్నం సవాల్**

**- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన**
**- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్**
**- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం

2లో..



## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు,
# కొత్త పింఛన్లు

**- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్**

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా

2లో..



# పాతబస్తీకి అభివృద్ధి జోరు

**- రూ.620 కోట్లతో చంచల్‌గూడ - సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం**

**- మలక్‌పేట బాలికల కళాశాలకు రూ.25 కోట్లు.. - మెట్రో పనులు వేగవంతం: సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. "పాతబస్తీ అంటే కేవలం పాత నగరం కాదు.. తెలంగాణకు అమూల్యమైన అసలైన నగరం. రాష్ట్రానికే గర్వకారణం" అని పేర్కొన్నారు. చంచల్‌గూడ–సంతోష్‌నగర్ మధ్య రూ.620 కోట్లతో నిర్మించిన 3.2 కిలోమీటర్ల స్టీల్ ఫ్లైఓవర్‌ను గురువారం

2లో..



## నా తల్లికి అన్యాయం జరిగింది
# రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను

**- కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు**
**- పరకాల నుంచి పోటీ చేయాలంటూ సీఎంకి సవాల్**
**- తన తల్లికి అన్యాయం జరిగిందని సుస్మిత ఆవేదన**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ మంత్రి పదవి తొలగింపు వ్యవహారం మరింత వేడెక్కింది. తన తల్లిని తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించడంపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆరోపించిన కొండా సుస్మిత, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన తల్లి గొంతును ఎవరూ నొక్కలేరని, రేవంత్ రెడ్డిని శపిస్తున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు.

2లో..



## పన్ను మినహాయింపులు ఇస్తేనే
# అమెరికాతో ఒప్పందం

**- కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు సుంకాల విషయంలో మినహాయింపులకు అమెరికా అంగీకరించిన తర్వాతే ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది వివరాలను వెల్లడిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. "న్యూజిలాండ్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలో అమలులోకి వస్తుంది ఆ తర్వాత 27 దేశాల కూటమి అయిన ఈయూతో అమలులోకి వస్తుంది.పోటీ దేశాలతో పోలిస్తే అమెరికా మనకు ప్రాధాన్యతా రేటును ఇచ్చేందుకు సిద్ధమైన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారు చేసి తుది వివరాలను ప్రకటిస్తాం" అని పీయూష్ గోయల్

2లో..



# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్

తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు.

### బీసీలకు అన్యాయం జరగలేదని చెప్పేందుకు పదవులు

కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది.

# నన్ను తొలగించడం కుట్రే

ఈ రోజు నాకు జరిగిన అన్యాయమే రేపు మీకు కూడా జరుగుతుందని, ఇప్పటికైనా మౌనం వీడకపోతే పార్టీకి తీవ్ర నష్టం తప్పదని హెచ్చరించారు.తమ మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంపై స్పందిస్తూ సుమంత్ పేరు చెప్పుకుని కిరణ్ అనే వ్యక్తి అక్రమ వసూళ్లకు పాల్పడితే, ఆ నెపాన్ని కావాలని సుమంత్‌పై నెట్టి సిసిఎస్ కేసు నమోదు చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. తమ అనుచరులను, కుటుంబ సభ్యులను మానసికంగా ఇబ్బంది పెట్టే రాజకీయాలు చరిత్రలో ఎక్కడా లేవని వాపోయారు. తన కూతురు సుస్మిత వ్యాఖ్యలను ఆసరాగా చేసుకుని తనను లక్ష్యంగా చేసుకున్నారని, తన భర్త కొండా మురళిని కారులో ఎక్కించుకుని ఊరంతా తిప్పి అవమానించారని ఆవేదన చెందారు. ప్రజాదరణతో పైకి వచ్చిన తమకు నియోజకవర్గ ప్రజలే జవాబుదారీ అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రికి, పార్టీ అధిష్టానానికి ఒక ముఖ్యమైన హెచ్చరికతో కూడిన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సమర్థవంతంగా అమలు కాకపోవడం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిపోయిందని, కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న ప్రజాభిప్రాయంపై తక్షణమే సర్వే చేయించాలని సూచించారు. తాము ఏ పార్టీకి వ్యతిరేకం కాదని, కేవలం ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని విలేకరుల సమావేశంలో విడుదల చేసిన లేఖ ద్వారా స్పష్టత ఇచ్చారు.

# అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

వచ్చాయి. మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ-2026 ముసాయిదాకు ఆమోదం తెలిపింది. మంత్రివర్గ భేటీలో చర్చించిన విషయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

### పొగాకు రైతులకు ఊరట

2026--27 మార్కెటింగ్ సీజన్‌లో తోతాపురి మామిడికి మద్దతు ధర అమలు చేసేందుకు అవసరమైన నిధులను వర్కింగ్ క్యాపిటల్ ద్వారా సమీకరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్ కు అనుమతిని పొడిగిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. 2026 సీజన్‌లో 94 మిలియన్ కిలోల తక్కువ రకం, నాణ్యత లేని పొగాకు కొనుగోలుకు ధరల లోటు భర్తీ మద్దతుగా కిలోకు రూ.10 చొప్పున పొగాకు రైతులకు నేరుగా నగదు బదిలీ ద్వారా అందించేందుకు ఏపీ మార్క్ ఫెడ్‌కు రూ.94 కోట్ల నిధులను సమకూర్చే ప్రతిపాదనకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది.కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.624.88 లక్షల విలువైన 78 వరద నష్ట పునరుద్ధరణ పనులకు పాలనా ఆమోదం తెలిపింది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని టన్నెల్--2లో కిలోమీటర్ 11.847 వద్ద ఉన్న టన్నెల్ బోరింగ్ మెషీన్ ను డిస్మాంట్లింగ్ చేసే పనులను, ప్రస్తుతం ప్రాజెక్టులో 18.787 కి.మీ. మేర పనులు చేపడుతున్న మెస్సర్స్ మేఘా సంస్థకు అప్పగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పనులకు రూ.11.63 కోట్ల వ్యయం చేయడానికి అనుమతి మంజూరు చేసింది. మంగళగిరి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు సజావుగా పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది, రికరింగ్, నాన్ రికరింగ్ బడ్జెట్ అంశాలను పరిగణనలోకి తీసుకుని, మొత్తం 21 రెగ్యులర్ పోస్టులను మంజూరుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు, అవసరమైన వైద్య, పారా మెడికల్ సిబ్బంది కేడర్ ను మంజూరు చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

### ల్యాండ్ పూలింగ్ కు ఆమోదం

అమరావతి రాజధాని నగరంలో కొత్త భూ కేటాయింపులకు సంబంధించి మంత్రుల బృందం చేసిన సిఫార్సులను, ఏపీసీఆర్డీఏ అథారిటీ తీర్మానం ఆమోదించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శాకమూరు వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్‌లతో "అమరావతి సంఘమం" నిర్మాణానికి రూ.759.793 కోట్ల అంచనా వ్యయానికి క్యాబినేట్ ఆమోదం తెలిపింది. అమరావతి మీదుగా ఎర్రుపాలెం--నంబూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి 100 మీటర్ల బఫర్‌తో పాటు, క్యాపిటల్ సిటీ సరిహద్దు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు గ్రిడ్ రోడ్ల విస్తరణతో ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు, రైతుల అభ్యర్థన మేరకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ చేపట్టేందుకు ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పించేందుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. గుంటూరు జిల్లా కంతేరు గ్రామంలో 974 ఎకరాలు, తాడికొండ మండలం పరిధిలో 5,238.50 ఎకరాలు మొత్తం 6,212.50 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ చేసేందుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది.

### పౌల్ట్రీ పాలసీకి ఆమోదం

ఏపీ "పౌల్ట్రీ అభివృద్ధి విధానం 2025-2029" ముసాయిదాకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, వ్యాధుల పర్యవేక్షణ నివారణ, బయోసెక్యూరిటీని మెరుగుపరచడం, గ్రామీణ/బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీని అభివృద్ధి చేయడం, పౌల్ట్రీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం, మార్కెట్, ఎగుమతి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఈ పాలసీకి క్యాబినేట్ ఆమోదం తెలిపింది.

## బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో
# డిటోనేటర్ల కలకలం



**సికింద్రాబాద్, :** బోల్లారాం లో ని మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ క్యాంపు సమీపంలో డిటోనేటర్లు గుర్తించారు. ఫైరింగ్ రేంజ్ వెనుక గోడ సమీపంలో లేత ఆకుపచ్చ ప్లాస్టిక్ బకెట్లో డిటోనేటర్లు వుంచారు. గోల్ఫ్ ఎన్క్లేవ్ వెంచర్ సమీపంలో అనుమానాస్పదంగా బకెట్ గుర్తించారు. బకెట్లో 8 బండిల్స్లో 160 ఎలక్ట్రికల్ డిటోనేటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో బండిల్లో 20 డిటోనేటర్లు.. మొత్తం విలువ సుమారు రూ.32 వేలు. ఆర్మీ సిబ్బంది సమాచారంతో బొల్లారం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మల్కాజిగిరి బాంబ్ డిస్పోజల్ టీమ్కు సమాచారం ఇచ్చారు. డాగ్ రుద్రతో కలిసి ఘటనాస్థలిని బాంబ్ డిస్పోజల్ టీం పరిశీలించింది.

# 2027 వరకు ఎల్‌నినో

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది. సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

### పసిఫిక్‌లో అసాధారణ వేడి

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు. ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి.సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

### భారత్‌పై ఎలాంటి ప్రభావం.?

ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు. భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది. ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

### వేడి, కరవు.. కొన్ని చోట్ల భారీ వర్షాలు!

ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్-నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది. భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.

### వ్యవసాయం నుంచి నీటి వనరుల వరకు..

ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది. ఎల్‌నినో సహజమైన వాతావరణ చక్రంలో భాగమే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న సమయంలో ఇది మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

# మోదీని అడిగే దమ్ముందా.?

కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# పన్ను మినహాయింపులు ఇస్తేనే అమెరికాతో ఒప్పందం

అన్నట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించింది. 'లేవరేజింగ్ ఎఫ్‌టీఏల ఆట్‌రీచ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రాబోయే కొద్ది నెలల్లో కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, ఎస్ఏసీయూ (దక్షిణాఫ్రికా కస్టమ్స్ యూనియన్), జీసీసీ (గల్ఫ్ సహకార మండలి), ఇజ్రాయెల్ సహా ఇతర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్టీఏలు), అలాగే ఆసియా, కొరియా, జపాన్ వాణిజ్య ఒప్పందాలను సమీక్షించే ప్రయత్నాలు, భారత్‌కు ఇతర పోటీదారుల కంటే తక్కువ రేటుకే ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం వాటాను అందిస్తాయని ఆయన అన్నారు. భారత్ ఇప్పటికే యూకే, మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు అమల్లోకి రానున్నాయని తెలిపారు.భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం చర్చల దశలో ఉంది. ఇరు దేశాలు మార్కెట్ విస్తరణ, వాణిజ్య అడ్డంకులను తొలగించడం, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ముసాయిదా ఒప్పందం ఇప్పటికే పూర్తయిందని, మరో మూడు నుంచి నాలుగు నెలల్లో దీనిపై సంతకాలు చేసే అవకాశం ఉందని ఒక సీనియర్ అమెరికా అధికారి జులైలో తెలిపారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అమెరికా 'సెక్షన్ 301' వాణిజ్య విచారణలు మాత్రమే ఈ ఒప్పందానికి ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఒప్పందం 'కాగితంపై సిద్ధంగా ఉంది' అని, ఈ జాప్యం కేవలం సాంకేతిక విధివిధానాల వల్లనే తప్ప న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య పరిష్కారం కాని విభేదాల వల్ల కాదని ఆ అధికారి స్పష్టం చేశారు. మరోవైపు, ఇతర దేశాల కంటే భారతీయ ఎగుమతిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా తక్కువ పన్ను నిబంధనలను సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది.

## రహదారులపై వినాయక చందాలు
# వసూళ్ళు చేస్తే కఠిన చర్యలు

**మద్దికేర :** రహదారులపై,స్పీడ్ బ్రేకర్ల వద్ద వినాయక చవితి వేడుకలకు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మద్దికేర ఎస్సై హరిత హెచ్చరించారు.మద్దికేర పోలీస్ స్టేషన్ నందు గురువారం రోజున ఆమె మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా చిన్న పిల్లలు,యువకులు రోడ్ల మీద, స్పీడ్ బ్రేకర్ల వద్ద తాడులు కట్టి, వాహనాలను ఆపి బలవంతంగా చందాలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఇలా రోడ్లపై తాడులు కట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.ఇలా వాహనదారులతొ డబ్బులు వసూళ్ళు చేయడం చట్టరీత్యా నేరమని ఆమె తెలిపారు. కనుక చిన్న పిల్లలను రోడ్ల మీదకు పంపి చందాలు వసూలు చేయించరాదని ఎస్సై హరిత హెచ్చరించారు.వినాయక మండపాలకు చందాలు కావాలంటే ఇంటింటికి వెళ్లి స్వచ్ఛందంగా అడగాలన్నారు.రోడ్ల మీద తాడులు కట్టడం,స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనాలను అడ్డగించడం పూర్తిగా నిషేధమని ఆమె తెలియజేశారు.పోలీసుల నిబంధనలు అతిక్రమించిన వారిపై, తల్లిదండ్రులపై,నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని ఎస్సై హరిత తెలిపారు.పండుగ సమయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా డయల్ 100 కు లేదా మద్దికేర పోలీస్ స్టేషన్ ఎస్సై ఫోన్ నంబర్ 9121101130 కు ఫోన్ చేయాలని మద్దికేర ఎస్సై హరిత తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మద్దికేర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాల ఖిల్లా నుంచే.. గులాబీ గర్జన

సాగునీరు అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కెటిఆర్ విమర్శించారు. ఎన్ని తడులు నీరు విడుదల చేస్తారు, ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారు, వారబందీ విధానం అమలు చేస్తారా అనే అంశాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. 2003లో సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల కోసం కెసిఆర్ పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను కూడా పాదయాత్ర చేస్తానన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## పాతబస్తీకి
# అభివృద్ధి జోరు

ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

### రూ.620 కోట్లతో ఫ్లైఓవర్

చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు ఒవైసీ జంక్షన్ మార్గాన్ని సులభతరం చేసేలా ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఓపెన్‌టాప్ జీపులో వంతెనపై ప్రయాణించి పరిశీలించారు. అనంతరం చంచల్‌గూడ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన సభలో మాట్లాడారు.

### బాలికల కళాశాలకు రూ.25 కోట్లు

మలక్‌పేటలో బాలికల ఉన్నత విద్య కోసం ప్రత్యేక జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన జీవోను ఒక్కరోజులో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. 12 నుంచి 18 నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలని గడువు విధించారు. పనుల పర్యవేక్షణ బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్‌కు అప్పగించారు.

### 'పాతబస్తీ ఆత్మ'

పాతబస్తీ హైదరాబాద్ నగరానికి అసలైన ఆత్మ అని సీఎం అన్నారు. చార్మినార్ చుట్టూ శతాబ్దాల క్రితమే అంతర్జాతీయ స్థాయి మార్కెట్లు రూపుదిద్దుకున్నాయని గుర్తుచేశారు. పత్తర్‌గట్టి, మదీనా మార్కెట్, చూడీబజార్, ఏక్ మినార్, గుల్జార్‌హౌజ్ వంటి వాణిజ్య ప్రాంతాల ప్రాధాన్యాన్ని వివరించారు. పాతబస్తీని ఆధునిక సదుపాయాలతో మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### మెట్రోకు డిసెంబరులో పనులు

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు మార్గాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మార్గాన్ని రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానిస్తామని తెలిపారు. రహదారి విస్తరణకు అవసరమైన 900 ఆస్తుల్లో 850 వరకు సమస్యలు పరిష్కారమయ్యాయని, మిగిలిన 50 ఆస్తులను త్వరగా క్లియర్ చేసి డిసెంబరులో క్షేత్రస్థాయి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

### రూ.500 కోట్లతో కేబుల్ వంతెన

మీర్‌ఆలం ట్యాంక్ వద్ద రూ.500 కోట్లతో మూడు కిలోమీటర్ల భారీ కేబుల్--స్టేడ్ వంతెన నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. నిలిచిపోయిన ఆరాంఘర్ ఫ్లైఓవర్, జోహ్రాబాగ్ వంతెన, శాస్త్రిపురం రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులతో పాటు చాంద్రాయణగుట్టలో రహదారులు, డ్రైనేజీ, అండర్‌గ్రౌండ్ కేబులింగ్ పనులను సమీక్షించినట్లు చెప్పారు.

### మూసీ పునరుజ్జీవనానికి మద్దతు

మూసీ, ఈసా నదుల పునరుజ్జీవనాన్ని ప్రభుత్వం చేపడుతోందని సీఎం పేర్కొన్నారు. సబర్మతి, గంగ, యమునా నదుల ప్రక్షాళనను సమర్థించే వారు హైదరాబాద్ నదుల పునరుజ్జీవనాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.

నదుల అభివృద్ధితో పరిసర ప్రాంతాలు బాగుపడటంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, నైట్ మార్కెట్లు, 24 గంటల వాణిజ్య జోన్లకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

### పేదలకు ఇళ్ల కోసం భూముల స్వాధీనం

చార్మినార్, యాకుత్‌పురా ప్రాంతాల్లో స్థలాల కొరతను అధిగమించి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పేదల కోసం లక్ష ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు.హిందూ, ముస్లింలు తెలంగాణకు రెండు కళ్లవంటివారని రేవంత్‌రెడ్డి అన్నారు. ముస్లిం యువతకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు 4 శాతం రిజర్వేషన్లు దోహదపడ్డాయని పేర్కొన్నారు.

పాతబస్తీ ప్రజలు, నాయకులతో కలిసి రాబోయే 25 ఏళ్లూ పనిచేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్, ఎమ్మెల్యేలు అహ్మద్ బలాలా, దానం నాగేందర్, నవీన్ యాదవ్, జాఫర్ హుస్సేన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.

# నా తల్లికి అన్యాయం జరిగింది రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను

గురువారం మీడియాతో మాట్లాడిన కొండా సుస్మిత, తాను గతంలో చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన వ్యక్తిగత హోదాలో చేసినవేనని స్పష్టం చేశారు. అవి ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు కాదన్నారు. ఒక వ్యక్తిని ఉద్దేశించి మాత్రమే తాను మాట్లాడానని వివరించారు.

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన తీరు తనను తీవ్రంగా బాధించిందని కొండా సుస్మిత అన్నారు. తన తల్లికి అన్యాయం జరిగిందని తన తల్లిని ఇలా చూసినందుకు తాను తీవ్రంగా బాధపడ్డానని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

తన తల్లికి అండగా తాను ఎప్పటికీ నిలబడతానని కొండా సుస్మిత స్పష్టం చేశారు. తన అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరని, తాను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొండా సుస్మిత నేరుగా సవాల్ విసిరారు. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నుంచి రేవంత్ రెడ్డి పోటీ చేయాలని సవాల్ చేశారు. తన తల్లి కోసం తాను రాజకీయంగా అండగా ఉంటానని స్పష్టం చేశారు.

# మధుసూదన్ శర్మ ఉద్యోగ విరమణ సభ

**మేనిఫెస్టో హామీలను అమలు చేయాలన్న- ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి**



గజ్వేల్( ప్రశ్న న్యూస్ )జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునిగడపలో తెలుగు పండితులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆదరాజుపల్లి మధుసూదన్ శర్మ అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ **ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీశారు:**

**ఉద్యోగుల హక్కుల సాధన:** కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మెరుగైన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల కోసమే ఉద్యోగులు పోరాడుతున్నారని, త్వరలోనే డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాజుపల్లి శశిధర్, పత్రిక సంపాదక వర్గ సభ్యులుపిన్నింటి రామకృష్ణారెడ్డి, మండల విద్యాధికారి సైదులు, పీఆర్‌టీయూ జగదేవపూర్ మండల అధ్యక్షులు చిలుకూరు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొద్దు నాయక్, అసోసియేట్ అధ్యక్షులు వంగ శ్రీనివాసరెడ్డి, కే. ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు ఎండీ రహీం, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమికి అక్రమ 'పట్టా'

**- ఆధారాల్లేకుండా రిజిస్ట్రేషన్ - వీఆర్ఓ మల్లారెడ్డి సస్పెన్షన్**

**- ప్రభుత్వ ఆస్తుల జోలికొస్తే కఠిన చర్యలు: జేసీ సూరజ్ ధనుంజయ్**



నంద్యాల(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పోరంబోకు భూమిని ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన అధికారులు.. ఆరోపణలు నిర్ధారణ కావడంతో వీఆర్‌ఓపై వేటు వేశారు. ప్యాపిలి మండలం మాధవరం గ్రామంలో గతంలో వీఆర్‌ఓగా పనిచేసిన మల్లారెడ్డిని సస్పెండ్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తెలిపారు.

### ఆధారాల్లేకుండానే రిజిస్ట్రేషన్

మాధవరం గ్రామంలోని సర్వే నంబరు 507లో ఉన్న గ్రామకంఠం (ప్రభుత్వ పోరంబోకు) భూమిని సరైన ఆధారాలు, సహాయక పత్రాలు లేకుండానే ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై జేసీ విచారణ చేపట్టారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ కావడంతో ప్రస్తుతం డోన్-1 క్లస్టర్ వీఆర్‌ఓగా పనిచేస్తున్న మల్లారెడ్డిని బుధవారం సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

### ప్రభుత్వ ఆస్తులపై కన్నేస్తే చర్యలే

ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, పోరంబోకు భూముల విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా ఉపేక్షించబోమన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పల్లెకు వైద్యం.. ప్రజలకు భరోసా

**దాములూరులో గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం**

**రూ.36 లక్షలతో 15వ ఆర్థిక సంఘం**

**నిధులతో నిర్మాణం: ఎమ్మెల్యే కృష్ణప్రసాదు**



ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం దాములూరులో రూ.36 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.

గ్రామాల్లోనే ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తే ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ఎమ్మెల్యే తెలిపారు. నూతన ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు, పరీక్షల సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, ప్రసూతి సేవలు, చిన్నారులకు టీకాలు, పోషకాహార పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కృష్ణప్రసాదు సూచించారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొండూరు కిడ్నీ బాధితులకు జలధార

**- రూ.49.94 కోట్లతో తాగునీటి పథకం పూర్తి..- 75 వేల మందికి ప్రయోజనం**



విజయవాడ (ప్రశ్న న్యూస్) కిడ్నీ వ్యాధులతో సతమతమవుతున్న ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండల ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఏళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధారల నిధులతో చేపట్టిన ఎ.కొండూరు రక్షిత తాగునీటి పథకం పనులు పూర్తయ్యాయి. రూ.49.94 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టుతో 38 ఆవాసాల్లోని దాదాపు 75 వేల మందికి ఇంటింటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందనుంది.ఎ.కొండూరు మండలంలో 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. 15 గిరిజన తండాల్లోనూ ఇదే పరిస్థితి. కలుషిత జలాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను 2024 ఎన్నికలకు ముందే పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లారు. 26 నెలల్లోనే పనులను పూర్తి చేశారు.ఇబ్రహీంపట్నంలోని ఎన్టీపీసీ కాలువ నుంచి కృష్ణా జలాలను తీసుకుని అక్కడే శుద్ధి చేసి ఎ.కొండూరు మండలానికి తరలిస్తున్నారు. ఇందుకోసం సుమారు 130 కిలోమీటర్ల మేర పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్



ట్యాంకులు ఏర్పాటు చేశారు. ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల చొప్పున రక్షిత తాగునీటిని అందించేలా పథకాన్ని రూపొందించారు.తాగునీటి అవసరాల కోసం గతంలో ఎ.కొండూరు మండలానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. ఇందుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.2.50 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు శాశ్వత పథకం అందుబాటులోకి రావడంతో ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితికి



తెరపడనుంది.పైప్‌లైన్ నిర్మాణానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, రైల్వే శాఖలతోపాటు జాతీయ రహదారుల సంస్థ అధికారులతో సమన్వయం చేశారు. అనుమతులు వేగంగా వచ్చేలా చర్యలు చేపట్టారు.జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వ హయాంలో టెండర్ ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదని ప్రభుత్వం పేర్కొంది. 2024 మార్చితో జల్ జీవన్ మిషన్ గడువు ముగియడంతో ప్రాజెక్టు భవితవ్యంపై అనిశ్చితి నెలకొంది. కేంద్రం పథకాన్ని మరో నాలుగేళ్లు పొడిగించడంతో రాష్ట్ర వాటాను విడుదల చేసి పనులను తిరిగి ప్రారంభించినట్లు తెలిపింది.ఎ.కొండూరు ప్రాంతంలో త్వరలో పర్యటించి తాగునీటి పథకం పనుల నాణ్యతను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తంగా కృష్ణా జలాల ద్వారా రక్షిత తాగునీరు అందుబాటులోకి రావడంతో కిడ్నీ వ్యాధుల ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఎ.కొండూరు ప్రజలకు ఉపశమనం లభించనుంది.

# భగవంతుడు - భక్తుడికి మధ్య ఉన్న శాశ్వత బంధానికి నిదర్శనం కృష్ణాష్టమి వేడుక


లోకంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తు, ధర్మాన్ని కాపాడే లక్ష్యంతో శ్రీ మహావిష్ణువు అష్టమ అవతారంలో శ్రీకృష్ణునిగా జన్మించిన రోజే ఈ జన్మష్టమి. మానవాళికి కర్తవ్యాన్ని, భక్తి, జ్ఞాన మార్గాలను బోధించే భగవద్గీతను అందించిన శ్రీకృష్ణుని జన్మదినం కావడంతో ఇది ఆధ్యాత్మికంగా అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. చాంద్రమాన ప్రకారం భాద్రపద మాసం, కృష్ణపక్షం అష్టమి తిథి రోహిణి నక్షత్ర యుక్త అర్ధరాత్రి సమయంలో శ్రీకృష్ణుడు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ పండుగను జన్మాష్టమి, కృష్ణ జన్మాష్టమి, గోకులాష్టమి అని కూడా పిలుస్తారు, ఇది హిందువులు అత్యంత పవిత్రంగా భావించే పండుగలలో ఒకటి. విష్ణుమూర్తి యొక్క ఎనిమిదవ అవతారమైన శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని ఎంతో ఉత్సాహభరితంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే వేడుకలు. శ్రీకృష్ణాష్టమి కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, ఈ పండుగ మనలోని ఇంద్రియాలన్నింటినీ మేల్కొలిపే ఒక సంపూర్ణమైన సత్యం.

### జన్మాష్టమి ప్రాముఖ్యత

హిందూ చాంద్రమాన పంచాంగం ప్రకారం భాద్రపద మాసంలోని కృష్ణపక్షం అష్టమి తిథిలో 5,200 సంవత్సరాల క్రితం మధురలో దేవకి, వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించాడని భక్తుల విశ్వాసం. కాబట్టి ఈ రోజు ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సంతరించుకుంది. చెడును నిర్మూలించి, ధర్మాన్ని స్థాపించాలనే దైవిక లక్ష్యంతో జన్మించిన శ్రీకృష్ణుని జన్మదినోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. తనను చంపాలని చూసిన తన మేనమామ కంసుని నిరంకుశ పాలనకు ముగింపు పలకడానికే శ్రీ మహావిష్ణువు కృష్ణుడి అవతారం ఎత్తాడని, కంసుడు అనేకసార్లు హత్యాయత్నం చేసినప్పటికీ, శైశవం, బాల్యంలో కృష్ణుడు క్షేమంగా ఉండడం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచింది.

### రెండు రోజుల పాటు వేడుకలు

జన్మాష్టమి వేడుకలను రెండు రోజుల పాటు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. శ్రీకృష్ణుడు కృష్ణపక్షం లోని అష్టమి తిథిలో అర్ధరాత్రి జన్మించాడు. అయితే హిందు సంప్రదాయం ప్రకారం, ఒక రోజును, సూర్యోదయం నుండి మరుసటి రోజు సూర్యోదయం వరకు లెక్కిస్తారు. అంటే, అర్ధరాత్రి సమయాన్ని బట్టి అష్టమి తిథి వరుసగా రెండు రోజులు ఉండవచ్చు. ఫలితంగా అనేక ప్రాంతాలలో జన్మాష్టమి వేడుకలను రెండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. మొదటి రోజున, భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, కృష్ణుని జన్మ సమయమైన అర్ధరాత్రి వరకు మేల్కొని ప్రత్యేక పూజలు చేస్తు శ్రీకృష్ణున్ని కీర్తిస్తు భజనల చేస్తారు. మరుసటి రోజును నందఉత్సవం అని పిలుస్తారు, ఇది శ్రీకృష్ణుని జన్మదినోత్సవ ఆనందకరమైన వేడుకలకు గుర్తుగా నిర్వహిస్తారు. ఈ రోజున భక్తులు తమ ఉపవాసాన్ని విరమించి వివిధ ఉత్సవ కార్యక్రమాలలో పాల్గొంటారు. జన్మాష్టమి వేడుకలు సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే అనేక రకాల ఆచారాలు, సంప్రదాయాలతో నిక్షిప్తమై ఉంటుంది. ఉపవాసం నుండి విందుల వరకు, నిశ్శబ్ద ప్రార్థనల నుండి ఉత్సాహభరితమైన



బహిరంగ ప్రదర్శనల వరకు, జన్మాష్టమి లోని ప్రతి అంశం భక్తి, ఆనందంతో నిండి ఉంటుంది. జన్మాష్టమి నాడు భక్తులు కఠినమైన ఉపవాసం దీక్షను పాటిస్తు అందంగా అలంకరించిన ఉయ్యాలలో బాలకృష్ణుడిని లాలిస్తు, ప్రత్యేక పూజలను నిర్వహించి అర్ధరాత్రి దాటాక ఉపవాస దీక్షను విరమిస్తారు. శ్రీకృష్ణుని జననాన్ని పురస్కరించుకుని భక్తులు తమ జీవితాల్లోకి ఆ దైవ శిశువును ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నారనడానికి ఇది నిదర్శనం.

### ఉట్టి కొట్టడం ప్రాముఖ్యత

చిన్నతనంలో శ్రీకృష్ణుడు గోకులంలోని గొల్లభామల ఇళ్లలో వెన్న, పాలు, పెరుగు దొంగిలించి తినేవాడు. వాటిని దొరకకుండా పైకి కట్టే ఉట్లను కృష్ణుడు తన స్నేహితులతో కలిసి అందుకునేవాడు. ఈ నేపథ్యంలోనే శ్రీకృష్ణాష్టమి రోజున వీధుల మధ్య ఎత్తులో పాలు, పెరుగు, వెన్న, నెయ్యి లేదా పసుపు కొమ్ములు నింపిన కుండలను ఉట్టిలా కడతారు. యువకులు గుంపులుగా ఏర్పడి ఆ కుండను పగలకొట్టడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం.

### సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పాఠశాలల్లో ఘనంగా వేడుకలు నిర్వహిస్తుంటారు. పిల్లలకు శ్రీకృష్ణుడు, రాధ, కృష్ణుని జీవితంలోని ఇతర పాత్రల వేషధారణలో అలంకరించి కృష్ణుని బాల్య కథలు, ఆయన దివ్య కార్యాలు, భగవద్గీత బోధనలను ప్రదర్శిస్తు నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తు నాటి సంప్రదాయాలు ఆచారాలను నేటి తరానికి తెలియజేసే కృషి అభినందనీయం.

### జన్మాష్టమి సారాంశం

జన్మాష్టమి కేవలం ఒక మతపరమైన పండుగ మాత్రమే కాదు. ఇది జీవితం, ప్రేమ, దైవానికి, భక్తునికి మధ్య ఉన్న శాశ్వత బంధానికి సంబంధించిన వేడుక. ఈ సమయంలో, కర్మ, భక్తి, ధర్మం అనే సూత్రాలకు నిదర్శనంగా నిలిచిన శ్రీకృష్ణుని బోధనలలో మనల్ని మనం లీనం చేసుకొని, కృష్ణుని జీవితాన్ని స్మరించుకుంటు ఆధ్యాత్మిక ఎదుగుదలకు, అంతర్గత ఆనందానికి ఈ పండగ ఒక గొప్ప అవకాశాన్ని అందిస్తుంది.



**శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలతో**

**రవికుమార్ సంతోజు**

**బడంగ్ పేట. హైదరాబాద్**

# ఇద్దరు ఐపీఎస్‌లపై సస్పెన్షన్ ఎత్తివేత

విశాల్ గున్ని, కాంతి రాణా టాటాకు తిరిగి విధుల్లోకి అవకాశం క్రమశిక్షణ, క్రిమినల్ కేసులపై మాత్రం కొనసాగనున్న చర్యలు

అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విశాల్ గున్ని (2010 బ్యాచ్), కాంతి రాణా టాటా (2004 బ్యాచ్) లపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. ఇద్దరినీ తక్షణమే విధుల్లోకి పునరుద్ధరిస్తూ సాధారణ పరిపాలన శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే.. వారిపై కొనసాగుతున్న క్రమశిక్షణ, క్రిమినల్ కేసులకు ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదని ప్రభుత్వం స్పష్టం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సెప్టెంబరు 4 వరకు సస్పెన్షన్** అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, అప్పీల్ నిబంధనల ప్రకారం విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను ప్రభుత్వం గతంలో సస్పెండ్ చేసింది. అనంతరం సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పొడిగిస్తూ వచ్చింది. తాజాగా వీరిద్దరి సస్పెన్షన్ గడువు సెప్టెంబరు 4 వరకు కొనసాగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒకరోజు ముందుగానే సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది.

**డీజీపీ నివేదికల పరిశీలన** సస్పెన్షన్ ఎత్తివేతకు సంబంధించి డీజీపీ (హెచ్‌ఓపీఎఫ్) సమర్పించిన నివేదికలను ప్రభుత్వం పరిశీలించింది. అలాగే కాంతి రాణా టాటా ఆగస్టు 24న సమర్పించిన వినతిపత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. సంబంధిత అంశాలు, అందుబాటులో ఉన్న నివేదికలు, అధికారుల విజ్ఞప్తులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఇద్దరినీ విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**విధుల్లోకి తక్షణ పునరుద్ధరణ** ప్రభుత్వ నిర్ణయంతో విశాల్ గున్ని, కాంతి రాణా టాటా తక్షణమే విధుల్లోకి పునరుద్ధరించబడ్డారు. అయితే సస్పెన్షన్ ఎత్తివేతను కేసుల నుంచి పూర్తిస్థాయి విముక్తిగా పరిగణించలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇద్దరు అధికారులపై కొనసాగుతున్న క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో సస్పెన్షన్ ఎత్తివేతతోపాటు వారిపై ఉన్న కేసుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని వెల్లడించినట్లయింది.

**డీజీపీకి బాధ్యతలు** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వుల ప్రతులను ఇద్దరు అధికారులకు అందజేసి, వారి నుంచి రసీదు తీసుకోవాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది.



**ఇక తదుపరి పోస్టింగ్‌పై ఆసక్తి** ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో తదుపరి వారికి ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారన్న అంశంపై పోలీసు, పరిపాలనా వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సస్పెన్షన్ ఎత్తివేసినప్పటికీ క్రమశిక్షణ, క్రిమినల్ కేసులు కొనసాగనున్న నేపథ్యంలో వారి భవిష్యత్ పోస్టింగ్, బాధ్యతలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది చర్చనీయాంశంగా మారింది.

# రేవంత్ రెడ్డి 1000 రోజుల పాలనలో వందేళ్ల విధ్వంసం

**: బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి ధ్వజం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )?కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల వైఫల్యాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గజ్వేల్ ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ 'వంటావార్పు' నిరసన కార్యక్రమం జరిగింది. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, రాధాకృష్ణ శర్మ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు వంటేరు ప్రతాప్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సభలో వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రసంగిస్తూ కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు:- పల్లెలు, పట్టణాల దుస్థితి,హైడ్రా విధ్వంసం: పల్లె, పట్టణ ప్రగతి నిధులు ఆగిపోయి ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయి. మరోవైపు హైడ్రా, మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూల్చుతూ లక్షల కోట్ల స్కామ్‌లకు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ఖజానాను ఢిల్లీ అధిష్టానానికి మూటలు మోయడానికే రేవంత్ రెడ్డి పరిమితమయ్యారని విమర్శించారు.- కేసీఆర్ పదేళ్లపాటు ఎంతో శ్రమించి తీర్చిదిద్దిన వ్యవస్థలను రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందని, సమైక్య పాలనను మించిన సంక్షోభంలోకి రాష్ట్రాన్ని నెట్టిందని దుయ్యబట్టారు. ఇకనైనా విపక్షాలపై నిందలు వేయడం మాని ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లను అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ టీమ్ జెర్సీ ఆవిష్కరణ

**- క్రీడాకారులు రాణించి జిల్లాకు పేరు తేవాలన్న రాంగారి గణేష్**



గజ్వేల్ ( ప్రశ్నా న్యూస్ )నిజామాబాద్‌లోని పోలీస్ గ్రౌండ్‌లో సెప్టెంబర్ 4 నుండి 7వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్స్ గర్ల్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే సిద్ధిపేట జిల్లా జట్టు జెర్సీని అసోసియేషన్ ప్రెసిడెంట్ రాంగారి గణేష్ ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారిణులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు.

**-ఈ సందర్భంగా రాంగారి గణేష్ మాట్లాడుతూ:**

**క్రీడాకారులకు ప్రోత్సాహం:** రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి సిద్ధిపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**క్రీడా స్ఫూర్తి:** ఆటగాళ్లు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రమశిక్షణతో కూడిన ఆటతీరును ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఎస్ కోచ్ ఆర్. నరసింహతో పాటు జీఎఫ్సీ సభ్యులు జిల్లా చందు, చక్రపాణి, ఎల్లయ్య, సుగుణాకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

**- వట్టిపల్లిలో ఉచితంగా పండ్ల, అటవీ మొక్కల పంపిణీ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సాంప్రదాయ పంటలతో పాటు పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులు సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో ఉచిత మొక్కల పంపిణీ, నాటే కార్యక్రమం జరిగింది. 'మారి' సంస్థ ఆధ్వర్యంలో, 'సే ట్రీస్' , 'బ్లూ యెండర్' సంస్థల సహకారంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు.?ఈ సందర్భంగా **నిర్వహించిన కార్యక్రమంలోని ముఖ్యాంశాలు:**

మొక్కల పంపిణీ: గ్రామానికి చెందిన 20 మంది రైతులకు చెందిన సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసేందుకు మామిడి, కొబ్బరి వంటి పండ్ల మొక్కలతో పాటు దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే ఎర్రచందనం, మహాగని మొక్కలను ఉచితంగా అందజేసి, పొలాల్లో నాటించారు.

ఈ కార్యక్రమంలో 'మారి' తెలంగాణ ప్రాజెక్ట్ మేనేజర్ గాండ్ల రాజు, జగదేవ్‌పూర్ మేనేజర్ రావుల రాజేందర్, టీమ్ సభ్యులు కర్ణాకర్, బాలకృష్ణ, వెంకటేష్, నిమ్మల రాజు, మౌనిక, మహేశ్వరి, రవళి, రమాదేవి, శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు. అలాగే 'సే ట్రీస్' ప్రతినిధులు నారాయణ, శుభాన్, 'బ్లూ యెండర్' ప్రతినిధులు ప్రియం, ప్రసాద్, జగదేవ్‌పూర్ ఏవో వసంతరావు, ఏఈవో కృష్ణమూర్తి, వట్టిపల్లి ఉపసర్పంచ్ నాగరాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి కృపతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు

**కోవూరు ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



కోవూరు(ప్రశ్న న్యూస్) శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులతో కోవూరు నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.శ్రీమహావిష్ణువు దశావతారాల్లో శ్రీకృష్ణావతారం విశిష్టమైనదని పేర్కొన్నారు. ధర్మాన్ని రక్షించి, అధర్మాన్ని అంతం చేయడానికి శ్రీకృష్ణుడు అవతరించారని తెలిపారు. దేవకీ, వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర దినాన్ని దేశవ్యాప్తంగా జన్మాష్టమి, కృష్ణ జయంతి, గోకులాష్టమిగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని చెప్పారు.శ్రీకృష్ణ జన్మాష్టమి ధర్మం, సత్యం, న్యాయం, మంచితనంపై విశ్వాసాన్ని మరింత బలపరిచే పవిత్రమైన పండుగ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన ధర్మబోధలు నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు.నియోజకవర్గ ప్రజలంతా జన్మాష్టమిని భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. శ్రీకృష్ణుడి కృపతో ప్రజల జీవితాల్లో సకల శుభాలు కలగాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# శ్రీ కృష్ణ జన్మాష్టమి

## ధర్మాన్ని కాపాడేందుకు అవతరించిన జగన్నాథుడు శ్రీకృష్ణుడు







దుష్ట శిక్షణ... శిష్ట రక్షణ... ధర్మ పరిరక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఎనిమిదో అవతారంగా శ్రీకృష్ణుడు అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. భాద్రపద మాసం కృష్ణపక్ష అష్టమి తిథి, రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు జన్మించిన సందర్భంగా ప్రతి సంవత్సరం జన్మాష్టమిని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.కృష్ణాష్టమి, గోకులాష్టమి, అష్టమి రోహిణి, శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీకృష్ణ జయంతి, సాతమ్ ఆతమ్, జన్మాష్టమి వంటి పేర్లతో ఈ పర్వదినాన్ని వివిధ ప్రాంతాల్లో పిలుస్తారు.శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున ఉపవాసం ఉండి, రాత్రి శ్రీకృష్ణుని జన్మ సమయమైన అర్ధరాత్రి వేళ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు భజనలు, కీర్తనలు చేస్తూ స్వామివారిని స్మరిస్తారు.

**"మమాఖిల పాప ప్రశమనపూర్వక సర్వాభీష్ట సిద్ధయే**

**శ్రీ జన్మాష్టమీ వ్రతమహం కరిష్యే"**

అనే సంకల్ప మంత్రాన్ని స్మరిస్తూ శ్రీకృష్ణునికి పూజలు చేయడం శుభప్రదంగా భావిస్తారు.

### ముద్దుల బాలకృష్ణుడి జననం

మథురలోని కారాగారంలో దేవకీ, వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించాడు. దేవకీ సోదరుడు కంసుడు తనను చంపేది దేవకీకి పుట్టే ఎనిమిదో సంతానమేనని ఆకాశవాణి ద్వారా తెలుసుకున్నాడు. దీంతో దేవకీ, వసుదేవులను కారాగారంలో బంధించాడు.దేవకీకి జన్మించిన ఏడుగురు పిల్లలను కంసుడు సంహరించాడు. ఎనిమిదో సంతానంగా శ్రీకృష్ణుడు జన్మించిన సమయంలో కారాగారంలోని తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయని, కాపలాదారులు నిద్రలోకి జారుకున్నారని పురాణ కథనం.దైవ ఆజ్ఞతో వసుదేవుడు బాలకృష్ణుడిని తలపై బుట్టలో పెట్టుకుని యమునా నదిని దాటి గోకులానికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో కురిసిన భారీ వర్షం నుంచి ఆదిశేషుడు తన పడగలను విప్పి బాలకృష్ణుడిని కాపాడాడని కథనం.గోకులంలో నందుడు, యశోదమ్మల ఇంట బాలకృష్ణుడిని ఉంచి, అక్కడ జన్మించిన ఆడశిశువును తీసుకుని వసుదేవుడు తిరిగి మథురకు చేరుకున్నాడు.అలా మథురలో జన్మించిన కృష్ణుడు గోకులంలో పెరిగి, తన బాల్య లీలలతో అందరినీ మురిపించాడు.

### కృష్ణుడి వెన్న దొంగతనం... ప్రేమకు ప్రతీక!

బాలకృష్ణుడు అంటేనే అల్లరి, అమాయకత్వం, అపారమైన ప్రేమ గుర్తుకొస్తాయి. యశోదమ్మ ఇంట్లోనే కాకుండా గోపికల ఇళ్లలోకి వెళ్లి వెన్నను దొంగిలించి తినడం కృష్ణుడి బాల్య లీలల్లో అత్యంత ప్రసిద్ధమైనది.వెన్న కోసం స్నేహితులతో కలిసి కుండలను అందుకోవడం, ఉట్టిని పగలగొట్టడం, గోపికలను ఆటపట్టించడం వంటి కృష్ణుడి లీలలను భక్తులు ఎంతో ఆనందంగా స్మరించుకుంటారు.

అందుకే జన్మాష్టమి సందర్భంగా ఇళ్లలో చిన్న కృష్ణుడి పాదముద్రలను బియ్యప్పిండితో గీయడం, ఉట్టి కొట్టడం, వెన్న, మీగడ, పాలు వంటి నైవేద్యాలను సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

### కాళీయ మర్దనం... యమునకు విముక్తి

### కృష్ణుడి బాల్య లీలల్లో కాళీయ మర్దనం ఎంతో విశిష్టమైనది.

యమునా నదిలో కాళీయుడు అనే విషసర్పం నివసించడంతో ఆ నీరు విషపూరితమైపోయింది. ఆ నీటిని తాగిన పశుపక్ష్యాదులు ఇబ్బందులకు గురయ్యాయి. బాలకృష్ణుడు యమునలోకి దూకి కాళీయుడిపై నృత్యం చేశాడు.కృష్ణుడి పాదాల దెబ్బలకు కాళీయుడు తన అహంకారాన్ని విడిచిపెట్టి శ్రీకృష్ణుని శరణు కోరాడు. కాళీయుడి భార్యలు కూడా కృష్ణుడిని ప్రార్థించగా, శ్రీకృష్ణుడు అతనిని క్షమించి యమునను విడిచి వెళ్లమని ఆదేశించాడు.

**ఈ కథ దుష్టశక్తిపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా భావిస్తారు.**

### సుదామా స్నేహం... కృష్ణుడి గొప్పతనం

శ్రీకృష్ణుడు ద్వారకాధిపతిగా ఉన్నప్పటికీ తన చిన్ననాటి స్నేహితుడు సుదామాను మరచిపోలేదు. పేదరికంలో ఉన్న సుదామా తన భార్య కోరిక మేరకు శ్రీకృష్ణుడిని కలవడానికి కొద్దిగా అటుకులు తీసుకుని ద్వారకకు వెళ్లాడు. సుదామా తెచ్చిన అటుకులను శ్రీకృష్ణుడు ఎంతో ప్రేమతో స్వీకరించాడు. స్నేహితుడి ఆర్థిక పరిస్థితిని చూసి సుదామా అడగకుండానే అతని జీవితాన్ని సుఖసంతోషాలతో నింపాడని పురాణ కథనం. కృష్ణ-సుదామా స్నేహం నిజమైన స్నేహానికి చిరస్మరణీయమైన ఉదాహరణ.

జన్మాష్టమి పూజా విశేషాలుశ్రీకృష్ణ జన్మాష్టమి రోజున భక్తులు ఇళ్లను శుభ్రం చేసి, పూజా మందిరాన్ని పూలు, తోరణాలతో అలంకరిస్తారు.

బాలకృష్ణుడి విగ్రహానికి అభిషేకం చేసి, చందనం, కుంకుమ, అక్షింతలతో అలంకరించి పూజలు చేస్తారు.

**నైవేద్యాలు:**

అటుకులు , వెన్న , మీగడ , పాలు , పెరుగు ,పాయసం, వడపప్పు, చక్రపొంగలి , పానకం ,శొంఠి--బెల్లం ప్రసాదాలు ,ముఖ్యంగా అటుకులను శ్రీకృష్ణుడికి సమర్పించడం సుదాముడి భక్తి, స్నేహాన్ని గుర్తుచేస్తుంది.

### ఉట్టి కొట్టే వేడుక

జన్మాష్టమి సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో వీధుల్లో ఉట్టిని కట్టి ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహిస్తారు.

పెరుగు, వెన్న లేదా ఇతర ప్రసాదాలతో నింపిన కుండను ఎత్తుగా కట్టి, యువకులు బృందాలుగా ఏర్పడి మానవ పిరమిడ్‌లా నిలబడి ఉట్టిని కొట్టేందుకు ప్రయత్నిస్తారు.

ఈ వేడుక బాలకృష్ణుడి వెన్నదొంగతనం, అల్లరి లీలలను గుర్తుచేస్తూ ఆనందోత్సాహాలతో నిర్వహిస్తారు.

### ఈ జన్మాష్టమి సందేశం

**"అధర్మం ఎంత బలంగా కనిపించినా... ధర్మమే చివరికి విజయం సాధిస్తుంది."**

శ్రీకృష్ణుడి జీవితం కేవలం ఒక పురాణగాథ కాదు.

ధర్మాన్ని పాటించడం, కష్టాల్లో ధైర్యంగా నిలబడటం, స్నేహాన్ని గౌరవించడం, అహంకారాన్ని విడిచిపెట్టడం, అవసరమైనప్పుడు ఇతరులకు అండగా నిలవడం వంటి ఎన్నో జీవిత పాఠాలను ఆయన బోధించాడు.

### కృష్ణుడి వేణునాదం మనసుకు శాంతిని ఇవ్వాలి...

ఆయన బోధనలు మన జీవితాలకు మార్గదర్శకంగా నిలవాలి.

మేడ్చల్ ప్రతినిధి" చిన్న "

**ప్రజాప్రశ్న ప్రత్యేక కథనం...**

**కృష్ణాష్టమి సందర్భంగా మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు**

## కూటమి ధర్మమే.. జనసేన గౌరవమే

**స్థానిక సమరంలో జనసైనికులకు సముచిత ప్రాతినిధ్యం**

**కార్యకర్తల త్యాగాలను గుర్తించి నిర్ణయాలు: నాగబాబు**



బాపట్ల(ప్రశ్న న్యూస్) కూటమి ధర్మాన్ని పాటిస్తూనే జనసేన పార్టీ గౌరవం, కార్యకర్తల ఆకాంక్షలకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గురువారం బాపట్ల నియోజకవర్గ జనసేన కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

**త్యాగాలకు గుర్తింపు** సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చి జనసేన అనేక త్యాగాలు చేసిందని నాగబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు సముచిత ప్రాతినిధ్యం దక్కేలా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమగ్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. స్థానిక పరిస్థితులు, పార్టీ కోసం కార్యకర్తలు చేసిన సేవలు, త్యాగాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాలవారీగా ప్రాతినిధ్యం కల్పించేందుకు నాయకత్వం కృషి చేస్తోందన్నారు.

**కార్యకర్తలే పార్టీ బలం**

క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను నాయకత్వం దగ్గరకు తీసుకుని వారి అభిప్రాయాలను వినాలని పవన్ కల్యాణ్ చెబుతుంటారని నాగబాబు పేర్కొన్నారు. చట్టసభల్లో జనసేన గొంతు బలంగా వినిపించడానికి జనసైనికుల నిరంతర పోరాటం, శ్రమే కారణమన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజలకు మెరుగైన భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు ఉన్నా లేకపోయినా, జనసేనకు బలం ఉన్నా లేకపోయినా ప్రజాసేవలో తేడా ఉండకూడదన్నారు. పులివెందుల వంటి ప్రాంతాల్లో జనసేనకు పెద్దగా బలం లేకపోయినా అక్కడి ప్రజలు ఏ పార్టీకి చెందిన వారైనా సమానంగా సేవ చేయాలన్నదే పవన్ కల్యాణ్ భావన అని చెప్పారు. ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరినీ సమానంగా చూడటం, అందరికీ అందుబాటులో ఉండటమే ఆయన రాజకీయ విధానమని నాగబాబు పేర్కొన్నారు.

## డ్రెయిన్ల కాలుష్యానికి కళ్లెం

**గోదావరి ప్రక్షాళనకు సమగ్ర అధ్యయనం..**

**పుష్కరాల నాటికి స్వచ్ఛజలాలే లక్ష్యం**

**15 ప్రధాన, 45 మైనర్ డ్రెయిన్లపై ప్రత్యేక దృష్టి..**

**రూ.100 కోట్లతో మురుగు నియంత్రణ**

**'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' పేరుతో కార్యాచరణ**



అమరావతి(ప్రశ్న న్యూస్) గోదావరిలోకి చేరుతున్న డ్రెయిన్ల కాలుష్యానికి అడ్డుకట్ట వేసి నదిని సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రాజమహేంద్రవరం నుంచి అంతర్వేది వరకు గోదావరిలో కలుస్తున్న ప్రధాన, ఉప డ్రెయిన్లపై శాస్త్రీయ అధ్యయనం నిర్వహించాలని స్పష్టం చేశారు. పుష్కరాల నాటికి భక్తులు స్వచ్ఛమైన జలాల్లో స్నానమాచరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో సుమారు 15 ప్రధాన, 45 వరకు మైనర్ డ్రెయిన్లు నదిలో కలుస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా చేరుతున్న మురుగు, పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర కాలుష్య కారకాలపై సమగ్ర విశ్లేషణ చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. యనమదుర్రు డ్రెయిన్ ద్వారా పారిశ్రామిక వ్యర్థజలాలు వశిష్ట గోదావరిలో కలుస్తున్నట్లు పేర్కొన్నారు. రామచంద్రపురం ప్రాంత మురుగు టేకి మేజర్ డ్రెయిన్ ద్వారా, అమలాపురం వ్యర్థాలు కుమ్మర కాలువ ద్వారా, ధవళేశ్వరం సమీప వ్యర్థాలు గోరింకల డ్రెయిన్ ద్వారా నదిలోకి చేరుతున్నాయని వివరించారు.ప్రతి డ్రెయిన్ నుంచి క్రమం తప్పకుండా నీటి నమూనాలు సేకరించి పరీక్షించాలని ఆదేశించారు. బీఓడీ, సీఓడీతోపాటు ఘన వ్యర్థాలు, భారీ లోహాలు, హానికారక రసాయనాల స్థాయిలను పరిశీలించాలని సూచించారు. పారిశ్రామిక వ్యర్థజలాలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి అవుతున్నాయా? లేదా? అన్నది తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. శుద్ధి చేయని మురుగు నీరు నదిలో కలవకుండా చర్యలు చేపట్టాలన్నారు.కాలుష్య నియంత్రణ చర్యలకు అవసరమైతే ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి విడుదల చేసిన రూ.100 కోట్లను సమర్థంగా వినియోగించాలని పవన్ కల్యాణ్ సూచించారు. గోదావరి తీరంలోని గ్రామ పంచాయతీల్లో 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' లక్ష్యంతో చేపట్టిన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పుష్కరాల నాటికి వాటిని 'మోడల్ పుష్కర పంచాయతీలు'గా తీర్చిదిద్దాలని సూచించారు.గోదావరి ప్రక్షాళనను ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా తీసుకున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. గోదావరి తర్వాత కృష్ణా సహా రాష్ట్రంలోని ఇతర ప్రధాన నదులను కూడా కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపడతామని చెప్పారు. భవిష్యత్తులో కృష్ణా పుష్కరాలను కూడా 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' తరహా లక్ష్యంతో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

# 'మథి మారన్' మూవీ రివ్యూ!




తమిళంలో రూపొందిన మరో క్రైమ్ డ్రామానే 'మథి మారన్'. లెనిన్ బాబు నిర్మించిన ఈ సినిమాకి, మంత్ర వీరపాండియన్ దర్శకత్వం వహించాడు. ఇవానా .. వెంకట్ సెంగుట్టువన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, 2023లో థియేటర్లకు వచ్చింది. 'అమెజాన్ ప్రైమ్'లో తెలుగులోనూ అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. అది ఒక అందమైన పల్లెటూరు. ఆ విలేజ్ లో 'సుందరం' పోస్టుమేన్ గా పనిచేస్తుంటాడు. ఆయనకి ఒక కూతురు .. ఓ కొడుకు. వాళ్లిద్దరూ ట్విన్స్. మథి (ఇవానా) నెడుమారన్ (వెంకట్). అయితే నెడుమారన్ లో శారీరక పరమైన ఎదుగుదల ఆగిపోతుంది. దాంత్ అందరూ పొట్టివాడని అతనిని ఆటపట్టిస్తూ ఉంటారు. ఆ విషయంలో అతను మానసికంగా కుంగిపోకుండా 'మథి' అండగా నిలబడుతూ ఉంటుంది. ఇద్దరూ స్కూల్ చదువు పూర్తి చేసి, వేరు వేరు కాలేజీలలో చేరతారు. నెడుమారన్ పొట్టివాడైనప్పటికీ మంచి తెలివైనవాడు. అతని వ్యక్తిత్వం పట్ల ఆకర్షితురాలైన 'ప్రభావతి' అతనిని ప్రేమిస్తూ ఉంటుంది. చదువు పూర్తయిన తరువాత తండ్రి మాదిరిగా పోస్టుమేన్ గా చేయాలనేది నెడుమారన్ కోరిక. ఈ విషయంలోను అతనిని ఎంతో సపోర్టు చేసే మథి, తాను ప్రేమిస్తున్న వ్యక్తితో కలిసి ఊరొదిలి వెళ్లిపోతుంది. ఊహించని ఈ సంఘటన నుంచి అతను తేరుకోలేకపోతాడు.మథి ఆ విధంగా చేయడం వలన సుందరం ఆ ఊళ్లో తలెత్తుకోలేకపోతాడు. ఇంట్లో నుంచి వెళ్లిపోయే సమయానికి కూతురు గర్భవతి కూడా అనే నిజాన్ని తట్టుకోలేకపోతాడు. భార్యాభర్తలు ఇద్దరూ ఆ అవమానంతో ఆత్మహత్య చేసుకుని చనిపోతారు. దాంతో తన అక్కయ్యను వెతుక్కుంటూ నెడుమారన్ 'చెన్నై' కి చేరుకుంటాడు. ఆ సమయంలో అక్కడ వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. హంతకుడిని పట్టుకోవడానికి పోలీసులు గట్టిగా ప్రయత్నిస్తుంటారు. అక్కడికి వెళ్లిన నెడుమారన్ ఏం చేస్తాడు? అక్కడ జరుగుతున్న హత్యలకు కారకులు ఎవరు? పోస్టుమేన్ కావాలనే అతని కోరిక నెరవేరుతుందా? అనేది మిగతా కథ. 'రూపం చూసి ఎదుటివారి సామర్థ్యాన్ని అంచనా వేయకూడదు. తెలివి తేటలతోనే ఎవరైనా ఏ రంగంలోనైనా రాణిస్తారు. సమయస్ఫూర్తితోనే విజయాలను సాధిస్తారు. అందుకు హైటూ .. పర్సనలిటీతో పనిలేదనే ఒక కాన్సెప్ట్ చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వచ్చాడు. నెడుమారన్ పొట్టివాడు. అందువలన అతను చిన్నప్పటి నుంచి అందరితో అవహేళనలు ఎదుర్కుంటూ వస్తాడు. తాను హైట్ లేకపోవడం వలన జీవితంలో ఏమీ సాధించలేనేమో అనే ఒక భావనతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటాడు. ఎవరేమన్నా తన అక్కయ్యకి ఆసరాగా నిలబడాలని నిర్ణయించుకుంటాడు. ఇందుకు సంబంధించిన సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది.ఇక తల్లిదండ్రులను కోల్పోయి అక్కయ్యను వెతుక్కుంటూ సిటీకి వెళ్లిన నెడుమారన్, అక్కడ జరుగుతున్న వరుస హత్యలకు కారకులు ఎవరనేది తెలుసుకునే బాధ్యతను మీదేసుకుంటాడు. ఆ విషయంలో ఆయనకి ఎదురయ్యే అనుభవాల చుట్టూ సెకండాఫ్ నడుస్తుంది. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ కాస్త హడావిడిగా పరిగెడతాయి. రూపాన్ని బట్టి ఎదుటివారి టాలెంట్ ను జడ్జ్ చేయకూడదు. సమస్యలు పరిష్కారమయ్యేది తెలివి తేటలతోనే అనే లైన్ బాగానే ఉంది. కాకపోతే పోలీస్ డిపార్టుమెంట్ పక్కనే ఉంటూ, నేరస్థులను పట్టుకునే బాధ్యతను హీరోకి అప్పగించడమే కాస్త విడ్డూరంగా అనిపిస్తుంది. హీరో పొట్టివాడు కావడం వలన ఈ కథలోని ఇతర పాత్రలకు న్యాయం జరిగిందేమోకానీ, ఆడియన్స్ మాత్రం లవ్ .. యాక్షన్ .. రొమాన్స్ .. వంటి అంశాలను పూర్తిగా మిస్సయ్యారని చెప్పాలి.

వెంకట్ నటన చాలా బాగుంది. కాకపోతే ఆ పాత్రను డిజైన్ చేసిన విధానం వలన, ఎలాంటి సానుభూతి కలగదు. ఇవానా చాలా ఆకర్షణీయంగా కనిపించింది. కాకపోతే ఆమె వైపు నుంచి వేసుకున్న ట్రాక్ కూడా అంత ఇంట్రెస్టింగ్ గా ఏమీ అనిపించదు. ఫోటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. అక్కా తమ్ముళ్ల ఎమోషన్ .. వరుస హత్యలు .. పోలీస్ ఇన్వెస్టిగేషన్ చుట్టూ నడిచే కథ ఇది. పొట్టివాడైనా గట్టివాడే అనే విషయాన్ని దర్శకుడు ఎక్కడికక్కడ నిరూపించడానికి ప్రయత్నించాడు. అయితే ఆ దిశగా డిజైన్ చేసుకున్న సన్నివేశాలు ఆడియన్స్ కి కనెక్ట్ కాలేదు. హత్యలు జరిగే తీరు .. హంతకుడిని పట్టుకోవడానికి పన్నే వ్యూహాలు మరీ సిల్లీగా అనిపిస్తాయి. ఎలాంటి కొత్తదనం లేని ఓ మాదిరి కంటెంట్ కేటగిరీలోనే ఇది మిగిలిపోతుందని చెప్పచ్చు.

# దీపికను వెనక్కి నెట్టి..

## దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచిన రష్మిక మందన్న

భారత చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కన్నడ చిత్రసీమ నుంచి ప్రయాణం మొదలుపెట్టి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రష్మిక మందన్న, తాజాగా దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచారు. ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి పాప్యులారిటీ ర్యాంకింగ్‌లో, బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొణెను వెనక్కి నెట్టి రష్మిక ఈ ఘనత సాధించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది.'పుష్ప: ది రైజ్' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్ర దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'యానిమల్' సినిమాతో హిందీ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ఆమె మాస్ ఇమేజ్‌ను, క్రేజ్‌ను శిఖర స్థాయికి చేర్చింది. దీంతో పాటు 'ఛావా', 'కుబేర' వంటి విభిన్న భాషల చిత్రాలతో తన నటనను, ఉనికిని అన్ని పరిశ్రమలలోనూ బలంగా చాటుకున్నారు.రష్మిక విజయం కేవలం గత చిత్రాలకే పరిమితం కాలేదు. భవిష్యత్తులోనూ ఆమె డైరీ అగ్రశ్రేణి ప్రాజెక్టులతో నిండిపోయింది. రాబోయే అక్టోబర్ 16న విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబాలి' విడుదల కానుండగా, నవంబర్ 27న 'మైసా' ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు 'రాకా', 'పుష్ప 3', 'యానిమల్ పార్క్' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ ఆమెను దేశంలోనే అత్యంత బిజీగా ఉన్న నటీమణులలో ఒకరిగా నిలబెట్టాయి.రష్మిక అగ్రస్థానానికి చేరడం అనేది భారతీయ సినిమాలో మారుతున్న సమీకరణాలకు నిదర్శనం. ప్రాంతీయ భాషా చిత్రాల సరిహద్దులు చెరిగిపోయి, ప్రతిభ ఉన్న నటీనటులకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందనడానికి ఆమె విజయమే ఒక ఉదాహరణ. దీపిక పదుకొణె ఇప్పటికీ ఒక ఐకాన్‌గా కొనసాగుతున్నప్పటికీ, పలు భాషల్లో వరుస విజయాలు సాధించి, పాన్ ఇండియా స్టార్‌డమ్‌కు కొత్త నమూనాను సృష్టించారు రష్మిక. ఆమె



ప్రయాణం ఆధునిక స్టార్‌డమ్ భాషకు అతీతమని స్పష్టం చేస్తోంది.



## నా రిటైర్మెంట్ దగ్గరపడిందేమో అని కుటుంబ సభ్యులతో చెప్పాను: తాప్సీ

ప్రముఖ కథానాయిక తాప్సీ కొంత కాలంగా పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి సారించిన సంగతి తెలిసిందే. తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'గాంధారి' ఈరోజు నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దేవాశిష్ మఖీజా దర్శకత్వంలో, కనికా థిల్లాన్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ తన బిడ్డ కోసం పోరాడే పవర్‌ఫుల్ తల్లి పాత్రలో తాప్సీ కనిపించారు. ఇష్వాక్ సింగ్, జతిన్ సర్నా, స్వస్తికా ముఖర్జీ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం విడుదలై మంచి స్పందన పొందుతున్న తరుణంలో... తాప్సీ ఇండస్ట్రీ ధోరణిపై చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ... ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో వస్తున్న కొన్ని రకాల సినిమాలు, మార్కెట్ ధోరణిలను చూస్తుంటే తనకు నటనకు స్వస్తి చెప్పాలనే ఆలోచన వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కథల ఎంపికలో నాణ్యత, ప్రమాణాలు తగ్గించుకుని సినిమాలు చేయాల్సిన పరిస్థితి వస్తే, నటించడం మానేసి ప్రశాంతంగా రిటైర్ అవ్వడమే తనకు ఇష్టమని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా థియేటర్లలోకి వస్తున్న చిత్రాల తీరును గమనించి, "నా రిటైర్మెంట్ సమయం దగ్గరపడిందేమో" అని తన కుటుంబ సభ్యులతో కూడా సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిపారు. తనకు నటనపై ఎంతో ప్రేమ ఉన్నప్పటికీ, ఎలాంటి స్క్రిప్ట్‌నైనా ఓకే చేసేంత గుడ్డి ప్రేమ మాత్రం కాదని తాప్సీ స్పష్టం చేశారు. మార్కెట్ ట్రెండ్స్ మారుతుంటాయని, కానీ మనం చేసే సినిమాలు చరిత్రగా మిగిలిపోతాయని చెప్పారు. పదేళ్ల తర్వాత తన ఫిల్మోగ్రఫీని తిరిగి చూసుకుంటే తనకైనా, తన అభిమానులకైనా సిగ్గుచేటుగా అనిపించకూడదనేది తన తాపత్రయమని వెల్లడించారు. కష్టపడి సంపాదించుకున్న గుర్తింపును కాపాడుకునేందుకు, తన ప్రమాణాలకు తగిన కథలనే ఎంచుకుంటానని ఆమె స్పష్టం చేశారు.

## విడుదలకు ముందే సక్సెస్ మీట్..


## 'రంభ ఊర్వశి మేనక'పై అల్లరి నరేశ్ ఫుల్ కాన్ఫిడెన్స్



కథానాయకుడు అల్లరి నరేశ్ చాలా కాలం తర్వాత తనదైన శైలిలో ఫాంటసీ కామెడీ జోనర్‌లో నటించిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ సినిమా విజయంపై ఆయన పూర్తి ధీమా వ్యక్తం చేశారు. చిత్రం విడుదలకు ముందే సక్సెస్ మీట్ తేదీని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సెప్టెంబర్ 4న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నరేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో నరేశ్ మాట్లాడుతూ.. "ఈసారి కచ్చితంగా పెద్ద హిట్ కొడుతున్నాం. సినిమా సెప్టెంబర్ 4న విడుదలవుతుంది, సెప్టెంబర్ 9న సక్సెస్ మీట్ నిర్వహిస్తాం" అని ఎంతో ఆత్మవిశ్వాసంతో పేర్కొన్నారు. 'నాంది' చిత్రం తర్వాత తనకు సోలోగా ఆశించిన విజయం లభించలేదని అంగీకరించిన ఆయన, ఈ సినిమాతో ఆ లోటు తీరుతుందని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో నరేశ్ వీకే కూడా కీలక పాత్ర పోషించడంతో ప్రేక్షకులకు వినోదం రెట్టింపు అవుతుందని హామీ ఇచ్చారు.అక్కినేని నాగార్జున నిర్మాణంలో కథానాయకుడిగా నటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, నిర్మాతలు నిమ్మకాయల ప్రసాద్, రాజేశ్ దండా, దర్శకుడు చంద్ర మోహన్ చింతాడలకు కృతజ్ఞతలు తెలిపారు. కథానాయికలు రాశీ సింగ్, విష్ణు ప్రియా, ప్రషా సింగ్‌లు తమ పాత్రల్లో ఎంతో ఉత్సాహంగా నటించారని ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా వైవిధ్యమైన సీరియస్ పాత్రలు చేస్తున్న తాను, తిరిగి పూర్తిస్థాయి కామెడీతో ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉందని నరేశ్ పేర్కొన్నారు.

# 'రోమాంచకం' మూవీ రివ్యూ

అగ్ర దర్శకులు తమ సొంత నిర్మాణ సంస్థలో సినిమాలు నిర్మించడం కొత్తేమీ కాదు. ఇప్పుడు ఆ వరుసలోనే పాన్ ఇండియా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన బ్యానర్ భద్రకాళి సంస్థపై నిర్మించిన చిత్రం 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జోడీగా నటించిన ఈ సినిమాకు వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. ప్రచారం చిత్రాలతో, పబ్లిసిటీతో అలరించిన ఈ సినిమా యూత్‌లో మంచి బజ్‌ను తెచ్చుకుంది. ఇక ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఎలా ఉంది? 'రోమాంచకం' ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేసిందా? అనేది సమీక్షలో తెలుసుకుందాం. దఅన్వేష్ (సుమంత్ ప్రభాస్) ఫ్రెండ్స్‌తో కలిసి ఒక స్టార్టప్ కంపెనీని ప్రారంభించే ట్రయల్స్‌లో ఉంటాడు.ఇందులో భాగంగానే 'రోమాంచకం'పేరుతో డేటింగ్ యాప్‌ను డెవలప్ చేస్తుంటాడు. అమ్మాయిలు, అబ్బాయిల మధ్య రిలేషన్స్, ఒకరికొకరు సహకరించుకోవడం, ఒకరి అవసరాలు మరొకరు తీర్చడమే ఈ డేటింగ్ యాప్ లక్ష్యం అని చెప్పి ఇన్వెస్టర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటాడు. అయితే ఇదే యాప్ ద్వారానే చెన్నైకి చెందిన మైథిలి (అనంతిక సనీల్‌కుమార్) అనే అమ్మాయితో అతనికి పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిచయం ఇద్దరి మధ్య మరింత స్ట్రాంగ్ అవుతుంది. మైథిలి పుట్టినరోజున ఆమెని సర్‌ప్రైజ్ చేయాలని చెన్నై వెళతాడు. ఓ హోటల్‌లో ఉన్న అన్వేష్‌ని మైథిలి కలుస్తానని చెబుతుంది. కానీ మైథిలి హోటల్‌కు రాకుండా ఫోన్ స్విచ్చాఫ్ చేసి, సోషల్ మీడియా అకౌంట్లలోనూ అన్వేష్‌ని బ్లాక్ చేసేస్తుంది. అయితే మైథిలి హోటల్‌కు రాకపోవడానికి కారణం ఏమిటి? ఆమె కనిపించకపోవడానికి కారణమేమిటి? ఆమె మళ్లీ తిరిగొచ్చిందా? లేదా? అన్వేష్, మైథిలి పెళ్లి చేసుకున్నారా? లేదా? అనేది మిగతా కథ. ఈ సినిమా ఉపశీర్షిక.. ప్రేమ, హాస్యం.. ఉత్కంఠ అనే తగ్గట్టుగా దర్శకుడు ఈ మూడు అంశాలను మిక్స్ చేసి కథ రాసుకున్నాడు.అయితే ఇందులో హాస్యం మీదనే దర్శకుడు ఎక్కువగా ఫోకస్ పెట్టాడు. ప్రతి సన్నివేశంలో వినోదాన్ని పండించే ప్రయత్నం చేశాడు. అయితే ప్రేమకథ, ఉత్కంఠ అంశాలపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. హీరో లక్ష్యమైనా స్టార్టప్ కంపెనీతో మొదలైన కథలో ఆ తరువాత దాని ఊసే ఉండదు. ఫ్రెండ్స్ మధ్య సరదా సంభాషణలు, హీరో, హీరోయిన్‌ల మధ్య ఫోన్ సంభాషణలుతో కథ నడుస్తుంటుంది. అయితే హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు అంత లాజిక్‌గా అనిపించవు. ఆ సన్నివేశాలు కూడా పెద్దగా ఆకట్టుకోవు. ఇలాంటి మైనస్‌లు ఆలోచించే లోపే వచ్చే ఎంటర్‌టైన్‌మెంట్ సీన్స్ ఈ మైనస్‌లను కవర్ చేసే విధంగా కడుపుబ్బా నవ్విస్తాయి.



జెన్‌జీ కుర్రాళ్ల అల్లరి, వాళ్ల సరదా డైలాగులు ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్న అందిస్తాయి. ఫస్టాఫ్ వరకు సరదాగా, చిన్న ఉత్కంఠతో ముగుస్తుంది. ఇక సెకండాఫ్‌లోనే దర్శకుడికి అసలైన చాలెంజ్. సెకండాఫ్‌లో దర్శకుడు అసలు కథలోకి వెళతాడా? ఎలా ఉండబోతుంది అనే ఆసక్తి ప్రేక్షకులకు కలుగుతుంది. అయితే సెకండాఫ్‌లో కూడా ఉత్కంఠ, ప్రేమ అంశాలపై కంటే వినోదం వైపే మొగ్గు చూపాడు దర్శకుడు. ఉపేంద్ర లిమాయేని పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా చూపించి కామెడీ పండించే ప్రయత్నం చేసినా అది గందరగోళంగా అనిపిస్తుంది.

# రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)రేణిగుంట మండలంలో ఎస్ యు పురంలో 185 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ రేణిగుంట మండలం ఎస్ యు పురం గ్రామస్తులకు ఇచ్చిన మాటను నెరవేర్చడం ఎంతో సంతృప్తినిచ్చింది.రెండునెలల క్రితం గ్రామ ప్రజలు నా వద్దకు వచ్చి తాగునీటి సమస్య ఉందని చెప్పారు. వెంటనే స్పందించి, అధికారులతో మాట్లాడి బోరు వేయించాను.ఆ బోరు పనులు పూర్తయి, ఈరోజు నా చేతుల మీదుగా ప్రారంభించి గ్రామస్తుల దాహార్తి తీర్చడానికి అంకితం చేయడం చాలా సంతోషంగా ఉంది. అనంతరం గ్రామంలోని 185 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశాం.గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి రైతుల పాస్‌పుస్తకాలపై తన సొంత ఫోటోలు వేయించుకుని రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. కానీ మన కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీసుకున్న నిర్ణయంతో,ఆ ఫోటోలను తొలగించి అధికారిక రాజముద్ర తో కూడిన పుస్తకాలను రైతులకు అందజేశాం.ప్రజా ప్రభుత్వం అంటే ఎలా ఉండాలో చెప్పడానికి ఇదే నిదర్శనం. కార్యక్రమం ముగిసిన తర్వాత గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నాను. ప్రజలు చెప్పిన సమస్యలన్నింటినీ అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశాను. ఈ కార్యక్రమంలో నాతో పాటు అధికారులు, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు సామాజిక, జాతీయ చైతన్యానికి వేదికగా నిలవాలి

**ఏనుగు సుదర్శన్ రెడ్డి**



మేడ్చల్ ( ప్రశ్న న్యూస్) భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ మేడ్చల్ ఉమ్మడి మండల కో-కన్వీనర్‌గా నియమితులైన చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ను బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం చేయకుండా, ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చే సామాజిక, సాంస్కృతిక వేదికగా మలిచారని గుర్తు చేశారు. గణేష్ ఉత్సవాల ద్వారా ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు కుల, వర్గ భేదాలకు అతీతంగా సమాజాన్ని ఏకం చేయడంలో తిలక్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.అదే స్ఫూర్తితో నేటి గణేష్ ఉత్సవాలను సామాజిక ఐక్యత, సాంస్కృతిక పరిరక్షణ, జాతీయ చైతన్యం, ప్రజా భాగస్వామ్యానికి వేదికలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల ద్వారా యువత, ప్రజల్లో సేవా భావం, దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా శ్రీనివాస్ గౌడ్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.గణేష్ ఉత్సవాలు భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా కొనసాగుతూనే ప్రజలను కలిపే శక్తిగా, సమాజాన్ని చైతన్యపరిచే వేదికగా నిలవాలని ఏనుగు సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల కృష్ణ గౌడ్, జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు కమల్, మాజీ కార్పొరేటర్ బాబు, నాయకులు అర్జున్ బాబు, వంశీధర్ రెడ్డి, బండి విష్ణు గౌడ్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి 1000 రోజుల పాలనలో వందేళ్ల విధ్వంసం

**- బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి ధ్వజం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )?కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల వైఫల్యాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గజ్వేల్ ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ 'వంటావార్పు' నిరసన కార్యక్రమం జరిగింది. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, రాధాకృష్ణ శర్మ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు వంటేరు ప్రతాప్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.సభలో వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రసంగిస్తూ కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు:

- పల్లెలు, పట్టణాల దుస్థితి,హైడ్రా విధ్వంసం: పల్లె, పట్టణ ప్రగతి నిధులు ఆగిపోయి ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేని స్థితిలో పంచాయతీలు ఉన్నాయి. మరోవైపు హైడ్రా, మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూల్చుతూ లక్షల కోట్ల స్కామ్‌లకు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ఖజానాను ఢిల్లీ అధిష్టానానికి మూటలు మోయడానికే రేవంత్ రెడ్డి పరిమితమయ్యారని విమర్శించారు.
- కేసీఆర్ పదేళ్లపాటు ఎంతో శ్రమించి తీర్చిదిద్దిన వ్యవస్థలను రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందని, సమైక్య పాలనను మించిన సంక్షోభంలోకి రాష్ట్రాన్ని నెట్టిందని దుయ్యబట్టారు. ఇకనైనా విపక్షాలపై నిందలు వేయడం మాని ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లను అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఏడుపాయలలో ఘనంగా శ్రీ వనదుర్గ భవాని ట్రేడర్స్ ప్రారంభం

**- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు..**

**- నాణ్యమైన గ్రానైట్, ప్లంబింగ్, పెయింటింగ్ సామాగ్రి.- నిర్వాహకులు కొల్చారం మండల మాజీ జెడ్పీటీసీ మేఘమాల సంతోష్ కుమార్.**





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి పరిధిలో ఏడుపాయల టీ జంక్షన్ సమీపంలో శ్రీ వనదుర్గ భవాని ట్రేడర్స్ నూతన షాప్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై నూతన షాప్‌ను ప్రారంభించారు. కొల్చారం మండల మాజీ జెడ్పీటీసీ ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వనదుర్గ భవాని ట్రేడర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులకు నిర్వాహకులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు.శ్రీ వనదుర్గ భవాని ట్రేడర్స్‌లో నాణ్యమైన గ్రానైట్, ప్లంబింగ్, పెయింటింగ్ సామాగ్రి అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్ తెలిపారు. నిర్మాణ రంగానికి అవసరమైన వివిధ రకాల సామాగ్రిని ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వినియోగదారులకు సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచడంతో పాటు మెరుగైన సేవలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఏడుపాయల టీ జంక్షన్ సమీపంలో షాప్ ఏర్పాటు చేయడం వల్ల ఏడుపాయలు, కొల్చారం మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు నిర్మాణ సామాగ్రి కొనుగోలు మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, కొల్చారం మండలం మాజీ ఎంపీపీ అధ్యక్షురాలు మంజుల కాశీనాథ్, పైతర సర్పంచ్, కొల్చారం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి, కొల్చారం మండల యువత విభాగం అధ్యక్షులు తుంకులపల్లి సంతోష్ రావు, సీనియర్ నాయకులు ఎస్ నరేందర్ రెడ్డి, ఆర్ భాగారెడ్డి, అప్పాజీపల్లి ధనరాజ్, కొమ్ముల యాద గౌడ్, రాంపూర్ సర్పంచ్ నెల్లి రాజు, తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు తుక్కాపూర్ ఉపసర్పంచ్ ఆరె రవీందర్, చిన్న ఘనపూర్ సొసైటీ వైస్ చైర్మన్ పి రాజు గౌడ్, యువ నాయకులు కొమ్ముల సురేష్ గౌడ్, బైకరి శ్రీకాంత్, వివిధ గ్రామాల సర్పంచులు, బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి...

**కేసీఆర్ పాలన కోసం రైతుల ఎదురుచూపులు..**

**యాప్‌లో యూరియా.. చేతికందని ఎరువు...**

**రైతు సమస్యలపై బీఆర్ఎస్ సమరభేరి:**

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి**





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, వ్యవసాయ, సాగునీటి రంగాలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు.. దాదాపు వెయ్యి రోజులు పూర్తయినా రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాలేదని విమర్శించారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని పోస్టాఫీసు వద్ద వంటవార్పు నిర్వహించారు. అనంతరం రైతు సదస్సులో పాల్గొని మాట్లాడారు. సదస్సుకు తరలివచ్చిన ప్రతి రైతుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ 14 ఏళ్లపాటు పోరాడి, చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించడంతోపాటు దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేశామని తెలిపారు.తెలంగాణ ఏర్పడిన అనంతరం కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులకు ఎంతో చేశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతి కల్పించడంతోపాటు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేశారని, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.ప్రస్తుతం యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు చూస్తే బాధ కలుగుతోందన్నారు. యూరియా యాప్‌లో అందుబాటులో ఉన్నట్లు చూపుతున్నా.. దుకాణాలకు వెళ్తే ఎరువు దొరకని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రతి రైతు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసి యాప్ ఉపయోగించడం సాధ్యమేనా? అని ప్రశ్నించారు.యూరియా పంపిణీ ప్రక్రియను రైతులకు సులభతరం చేయాలని, యాప్ నిబంధనలను తొలగించి సాధారణంగా దుకాణాల్లోనే ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుబంధు కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతుబీమా విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రైతుల కళ్లల్లో కన్నీళ్లు తెప్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు.పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను కూడా మోసం చేశారని ఆరోపించారు.మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పేరుతో ఒకవైపు ప్రచారం చేసుకుంటూ మరోవైపు టికెట్ ధరలు పెంచారని, బస్సుల సంఖ్య తగ్గించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.కేసీఆర్ పదేళ్లలో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని విమర్శించారు. రైతుల కష్టాలను చూసి కేసీఆర్ గుండె తల్లడిల్లుతోందన్నారు.కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సదస్సులు, ప్రజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ, సాగునీటి రంగాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. యూరియా పంపిణీలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించి, ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన కార్యక్రమాలను వారు వివరించారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, సాగునీటి వసతుల కల్పన వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతుల విస్తరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# కాసులు కురిపిస్తున్న 'అక్రమ షెడ్లు'

**- అక్రమార్కుల అడ్డాగా కీసర సర్కిల్**

**- అధికారుల మౌనం.. అక్రమార్కుల ప్రతాపం**

**- నోటీసులతో కాలయాపన.. రాత్రికి రాత్రే లేస్తున్న నిర్మాణాలు**

**- ప్రభుత్వ ఖజానాకు గండి.. ఉన్నతాధికారులు మౌనం**

**- డిప్యూటీ కమిషనర్ జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ శూన్యం**

**- పత్రికలో కథనాలు వచ్చిన పట్టించుకోని ఉన్నతాధికారులు, రెచ్చిపోతున్న సిబ్బంది**



కీసర (ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు అసలు తగ్గడం లేదు. నిబంధనలను బేఖాతరు చేస్తూ, అధికారుల కనుసన్నల్లోనే ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాణిజ్య షెడ్లు, గోదాములు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కీసర, అహ్మద్‌గూడ, దమ్మాయిగూడ, యాప్రాల్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.



అక్రమ నిర్మాణాలపై స్థానికులు, కాలనీవాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రం అధికారులు హడావుడిగా నోటీసులు జారీ చేయడం.. పనులు నిలిపివేయించామని రికార్డుల్లో చూపి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు వెళ్లిన మరుక్షణమే పనులు మరింత వేగవంతం కావడం గమనార్హం. పగలు, రాత్రి తేడా లేకుండా నిర్మాణాలు పూర్తవుతున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'నజరానాలు' చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి . మున్సిపాలిటీ స్థాయి నుంచి కార్పొరేషన్ పరిధిలోకి మారినప్పటికీ అధికారుల అలసత్వ ధోరణిలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని అధికార పార్టీకి చెందిన కొందరు నేతల అండదండలు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. నిబంధనల ప్రకారం రావాల్సిన రుసుములు, పన్నులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందనే ఆరొపనులున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

టౌన్ ప్లానింగ్ విభాగంలో కాగితాలకే పరిమితమయ్యే నోటీసుల డ్రామాలకు స్వస్తి పలికి, అక్రమంగా వెలుస్తున్న భారీ షెడ్లను తక్షణమే సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న డిప్యూటీ కమిషనర్, సెక్షన్ ఆఫీసర్, ఏసిపి లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ఉన్నతాధికారులు, విజిలెన్స్ బృందాలు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డే పార్కింగ్.. పోలీసులదే నిర్లక్ష్యం

- ఎల్‌బీనగర్‌లో రోడ్ల ఆక్రమణ.. ట్రాఫిక్ పోలీసుల మౌనం
- పార్కింగ్ లేదు.. ట్రేడ్ లైసెన్స్ ఎలా వచ్చింది.?
- 24 గంటలు రోడ్డుపైనే పార్కింగ్.. అధికారులు ఏం చేస్తున్నారు.?
- ఫుట్‌పాత్ కబ్జా.. రోడ్డుపై పార్కింగ్.. ప్రజలకు నరకయాతన
- చిట్టిబాబు బిర్యానీ ముందు మెయిన్ రోడ్డే పార్కింగ్ స్థలం
- మామూలు ఇస్తున్నాం.. మమ్మల్ని ఎవరేం చేస్తారు.?
- ఎల్‌బీనగర్ చౌరస్తా అస్తవ్యస్తం.. ట్రాఫిక్ పోలీసుల డ్యూటీ ఎక్కడ.?
- రోడ్లు వ్యాపారుల సొంతమా.? పార్కింగ్ మాఫియాకు పోలీసుల అండనా.?
- ట్రాఫిక్ జామ్‌లకు అడ్డుకట్ట ఏది.? సీఐ, ఏసీపీ పర్యవేక్షణ ఏది.?
- వాహనాల ఫోటోలకే పరిమితమా, అక్రమ పార్కింగ్ పై పట్టింపు ఎక్కడ.?







ఎల్‌బీనగర్ (ప్రశ్న న్యూస్) ఎల్‌బీనగర్ చౌరస్తా అంటే నిత్యం రద్దీ.. వాహనాల రాకపోకలతో కిటకిటలాడే ప్రాంతం. అలాంటి కీలక ప్రాంతంలో రహదారులే పార్కింగ్ ప్రదేశాలుగా మారుతున్నా ట్రాఫిక్ పోలీసులు అసలు పట్టించుకోవడం లేదనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు మెయిన్ రోడ్డు పక్కనే హోటళ్ల ముందు వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది.

### పార్కింగ్ లేకుంటే ట్రేడ్ లైసెన్స్ ఎలా.?

వ్యాపార సంస్థలకు పార్కింగ్ సదుపాయం ఉందా.? లేదా.? అనే అంశాన్ని మున్సిపల్ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. అయితే పార్కింగ్ సదుపాయం లేకపోయినా వ్యాపారాలకు అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు ఎలా జారీ అయ్యాయన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. లంచాలు తీసుకొని ట్రేడ్ లైసెన్లు ఇష్టారాజ్యాంగ ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యాపార సంస్థలకు వచ్చే వాహనాలు రోడ్డుపైనే నిలిస్తే ప్రజలు, పాదచారులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడటం సహజం.

### 24 గంటలు రోడ్డుపైనే పార్కింగ్

ఎల్‌బీనగర్‌లోని చిట్టిబాబు బిర్యానీ ముందు రహదారి వాహనాల పార్కింగ్‌తో నిత్యం ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాలు రహదారిపైనే నిలిచిపోతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని రహదారిని పార్కింగ్ గా మార్చుకున్న వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు.

### మామూలు ఇస్తున్నాం, ఎవరు ఏం చేస్తారు.?

అక్రమ పార్కింగ్‌పై పాదాచారులు ప్రశ్నిస్తే కొందరు వ్యాపార యజమానులు దౌర్జన్యంగా వ్యవహారిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులకు మామూలు ఇస్తున్నాం.. ఎవరేం చేసుకుంటారో చేసుకోండి..

మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అంటూ కొందరు బహిరంగంగానే సవాల్ చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత.? అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

### రోడ్లు,ఫుట్‌పాత్‌లు కబ్జా.. పాదచారులకు తిప్పలు

ఒకవైపు రోడ్లపై పార్కింగ్.. మరోవైపు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ఎల్బీనగర్ చౌరస్తా ప్రాంతంలో పాదచారుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. నడిచేందుకు ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో ప్రజలు రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రమాదాల పారిన పడుతున్నారని, మరింత ప్రమాదాల ముప్పు కూడా పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ట్రాఫిక్ సీఐ, ఏసీపీ పర్యవేక్షణ ఏది.?

ఇంతటి కీలకమైన ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా ట్రాఫిక్ సీఐ, ఏసీపీ స్థాయి అధికారులు పరిస్థితిని ఎందుకు సమీక్షించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రహదారిపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాల్సిన పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### పోలీసులు డ్యూటీ చేస్తున్నారా.? డౌటే

ఎల్‌బీనగర్ చౌరస్తా చుట్టుపక్కల రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నా, వాహనాలు ఇష్టారాజ్యంగా నిలుస్తున్నా, ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యంగా మారుతున్నా అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారన్న ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది. రోడ్లు ప్రజల రాకపోకల కోసం..

వ్యాపార సంస్థల ప్రైవేట్ పార్కింగ్ కోసం కాదని ఉన్నత అధికారులు గుర్తించాలి. రహదారులను ఆక్రమించి పార్కింగ్ చేస్తున్న వారిపై, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రేడ్ లైసెన్సుల జారీపై కూడా సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యను తీర్చకుండా అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే ఎల్‌బీనగర్ చౌరస్తా ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత చిరునామాగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా క్వారీ లీజుల పునరుద్ధరణ

-రావల్‌కోల్‌లో గ్రామసభ తీర్మానాలకు తూట్లు
- లీజులు పొడిగించవద్దని గతంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం
- ప్రజాభిప్రాయాన్ని తొక్కిపెట్టి దశాబ్దాల పాటు మైనింగ్ అనుమతులు మంజూరు
-అధికారిక రికార్డుల్లో బయటపడ్డ నిబంధనల ఉల్లంఘనలు.. బడా సంస్థలకు అధికారుల వత్తాసు




మేడ్చల్(ప్రశ్న న్యూస్) గ్రామీణ స్వపరిపాలనకు అత్యున్నత వేదికైన గ్రామసభ తీసుకున్న నిర్ణయాలను గనుల శాఖ అధికారులు బుట్టదాఖలు చేశారు. స్థానిక ప్రజల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామ పంచాయతీ పాలకవర్గం మొత్తం ఏకగ్రీవంగా వ్యతిరేకించినా, ఆ ప్రజాభిప్రాయాన్ని తొక్కిపెట్టి ప్రైవేట్ సంస్థలకు దశాబ్దాల పాటు క్వారీ లీజులను అప్పగించిన వైనం మేడ్చల్ మండల పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో తీవ్ర దుమారం రేపుతోంది. పంచాయతీరాజ్ చట్టం నిర్దేశించిన అధికారాలను పట్టించుకోకుండా, భారీ లాబీయింగ్‌తో లీజుల పునరుద్ధరణ జరిగిందనే విమర్శలు అధికారిక రికార్డుల ద్వారా స్పష్టమవుతున్నాయి. 02.02.2023 నాటి గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం సంఖ్య 212 ప్రకారం రావల్‌కోల్ గ్రామ పరిధిలో మైనింగ్, స్టోన్ క్రషర్ యూనిట్ల వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై 2023 ఫిబ్రవరి 2న గ్రామసభ ప్రత్యేకంగా సమావేశమైంది. సర్పంచ్ రాజబోయిన మహేష్ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు జరిగిన ఈ సమావేశంలో గ్రామంలోని రాంక్ సిలికాన్, జే.సి.పి.ఎం మరియు ఎస్.ఎస్.ఆర్.ఎస్ కంకర మిషన్లు, క్వారీల గడువు ముగిసిన తర్వాత వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పునరుద్ధరించకూడదని నిర్ణయించారు. ఈ కీలక నిర్ణయానికి ఉపసర్పంచ్ తెడ్డు రాజారాం, గ్రామ పంచాయతీ కార్యదర్శి అపర్ణతో పాటు పాలకవర్గ సభ్యులైన బంటు భాస్కర్, చుక్క భాగ్యలక్ష్మి, చుక్క బాబు, సబేరా బేగం, మామిండ్ల నిర్మల, ఆకుల శ్రీనివాసులు, బుక్యా సుగుణ, నాందేడ్ నర్సమ్మ, గున్నాల రాములు, మొండె రాజమ్మ, మందాపురం రమేష్ పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతూ రికార్డుల్లో అధికారికంగా సంతకాలు చేశారు.


### ప్రజాభిప్రాయాన్ని తొక్కిపెట్టి దశాబ్దాల పాటు లీజుల పొడిగింపు :

గ్రామ పంచాయతీ చేసిన అధికారిక తీర్మానాన్ని మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. గ్రామసభ తీర్మానం కాపీలను బేఖాతరు చేస్తూ, ప్రైవేట్ క్వారీ కంపెనీలకు ఏకంగా 20 ఏళ్ల చొప్పున సుదీర్ఘ కాలానికి లీజులను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రికార్డుల పరిశీలన ప్రకారం, సర్వే నంబర్లు 34, 35 ట 36 లోని 12.83 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న వీ/ం. రాంక్ సిలికాన్ ట ఇండస్ట్రీస్ సంస్థకు 2023 జూలై 17 నుండి 2043 జూలై 16 వరకు మైనింగ్ అనుమతులు పొడిగించారు. అదేవిధంగా సర్వే నంబర్లు 37, 38 లోని 9.310 హెక్టార్లలో విస్తరించి ఉన్న వీ/ం. జే.సి.పి.ఎం ఇండస్ట్రీస్ (జై చంద్ర ప్రకాష్ మెటల్) సంస్థకు 2024 జనవరి 6 నుండి 2044 జనవరి 5 వరకు మరో 20 సంవత్సరాల పాటు యథేచ్ఛగా లీజును రెన్యూవల్ చేశారు.

### అనుమతుల ఉల్లంఘనలు మరియు వివాదాస్పద సర్వే నంబర్లు :

మరోవైపు సర్వే నంబర్ 33 లోని 5.261 హెక్టార్లలో వీ/ం. సమ్మక్క సారక్క రాక్ సాండ్ ఇండస్ట్రీకి 2028 జూలై 30 వరకు కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అయితే, దీనికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 28, 32 ట 35 పరిధిలోని 13.49 హెక్టార్ల భారీ భూమికి సంబంధించి పర్యావరణ అనుమతులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆమోదాలు సరైన క్రమంలో లేకపోవడంతో అధికారిక పత్రాల్లో అది 'నాట్ వర్కింగ్' స్థితిలో ఉన్నట్లు నమోదైంది. పక్కపక్కనే ఉన్న సర్వే నంబర్లలో ఒకవైపు అనుమతులు లేకపోయినా, మరోవైపు గ్రామసభ తిరస్కరించినా యథేచ్ఛగా మైనింగ్ దందాను కొనసాగించేలా శాఖాపరమైన మద్దతు లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### చట్టాలను తుంగలో తొక్కిన అధికారులు.. ఉన్నత స్థాయి విచారణకు డిమాండ్ :




రాజ్యాంగబద్ధంగా గ్రామసభకు ఉన్న హక్కులను విస్మరించి, స్థానిక పంచాయతీ తీర్మానాన్ని తొక్కిపెట్టి నిబంధనలకు విరుద్ధంగా లీజులు ఎలా మంజూరు చేశారనే అంశంపై రావల్‌కోల్ గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని పణంగా పెట్టి క్వారీ యాజమాన్యాలకు మేలు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం తక్షణమే స్పందించి క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని, గ్రామసభ ఏకగ్రీవ తీర్మానానికి కట్టుబడి అక్రమ లీజుల పునరుద్ధరణను వెంటనే రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు
# అసద్ తక్కువేమీ కాదు

**- ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి తాను తప్ప మరెవరూ రాలేదన్నారు. ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

## దరిద్రాలన్నీ ఏకమై దాడిచేస్తున్నా
# దృఢంగా నిలబడతాం

**- మొండిగా ఎదురెళ్లగలమన్న కొండా మురళి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆమె భర్త, సీనియర్ నేత కొండా మురళి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. సురేఖ బర్తరఫ్ తర్వాత తొలిసారి స్పందించిన ఆయన ఎక్స్ వేదికగా భావోద్వేగంతో పాటు ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే ఇక్కడ ఎవరూ తట్టుకోరు" అంటూ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. తాము ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులు రేపు ఇంకెవరికి ఎదురవుతాయో అంటూ ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.పదవులు ఉన్నా లేకపోయినా తమ గౌరవం తమకు ఎప్పుడూ ఉంటుందని కొండా మురళి పేర్కొన్నారు. ప్రతి విషయానికీ వెంటనే స్పందించకపోవచ్చని.. కానీ జరుగుతున్న ప్రతి పరిణామాన్ని లోతుగా గమనిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తమపై అన్ని దరిద్రాలు ఒక్కటై కుట్రపూరితంగా రాజకీయ దాడులు చేశాయని మురళి ఆరోపించారు. అయితే తాము దేనికీ భయపడబోమని చెప్పారు. ఎంతటి కష్టాలు ఎదురైనా దృఢంగా నిలబడి తట్టుకుంటామని.. మొండిగా ఎదురువెళ్తామని పేర్కొన్నారు.కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోయిన వెంటనే కొండా మురళి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తమపై జరిగిన రాజకీయ కుట్రలను తిప్పికొడతామన్న సంకేతాలను ఆయన తన పోస్టు ద్వారా ఇచ్చారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కొండా దంపతుల తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తి నెలకొంది. మరోవైపు సురేఖ బర్తరఫ్ వార్తలు బయటకు రాగానే మురళి తన నివాసం వద్ద తనదైన శైలిలో రియాక్షన్ ఇచ్చారు. బయటకు వచ్చి విలేకరులను చూస్తూ మీసం మేలేశారు. తాము ఏమాత్రం చింతించడం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. ఎవరూ అధైర్యపడొద్దని.. భరోసాతో ఉండాలని పరోక్షంగా కార్యకర్తలకు సూచించారు.

## కొండా సురేఖ బర్తరఫ్
## ఆమె స్వయంకృతాపరాధం: ఆది శ్రీనివాస్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలోనూ వారిని వారించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అధిష్ఠానాన్ని సీఎం బ్లాక్‌మెయిల్ చేశారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. అలాగే, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించబడిన సీనియర్ నేత జి. చిన్నారెడ్డి అంశాన్ని కూడా ఈ సందర్భంగా విప్ ప్రస్తావించారు. చిన్నారెడ్డి అంటే సీఎం రేవంత్ రెడ్డికి ఎంతో గౌరవమని, గతంలో ఆయన గెలుపు కోసం రేవంత్ రెడ్డి శ్రమించారని గుర్తుచేశారు. అయితే ఎంతటి సీనియర్ నాయకులైనా సరే... పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్ఠానం తేల్చిచెప్పినందుకే ఈ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588